విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలి: కాంగ్రెస్

విశాలాంధ్ర-పులివెందుల: పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని కాంగ్రెస్‌పార్టీ పులివెందుల నియోజక వర్గ ఇన్‌చార్జి వేలూరు శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఆయన కలియతిరిగారు, ఈ సందర్భంగా గృహ వినియోగదారుల నుంచి విద్యుత్ బిల్లుల విషయమై ప్రస్తావించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో కరెంట్ బిల్లులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. విద్యుత్ బిల్లులు ఎక్కువ రావడంతో ముఖ్యంగా పేదలు సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజంతా కూలీ నాలి చేసుకుని కష్టపడే కష్టజీవులకు ఇలాంటి విద్యుత్ బిల్లులు తలకుమించిన భారమవుతున్నాయన్నారు. గతంతో పోలిస్తే ఇప్పుడు మూడింతలు ఎక్కువ కరెంటుబిల్లు వస్తుందని పేదలు తనతో చెప్పినట్లు శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని ఆయన కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కె తిరుపాల్ రెడ్డి,శ్రీకాంత్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు: డీఎస్పీ

విశాలాంధ్ర-వేంపల్లె: అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పులివెందుల డిఎస్పి శ్రీనివాసు లు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎర్రగుడిపల్లెలో డి.ఎస్.పి శ్రీనివాసులు ,అర్బన్ సీఐ రాజు, ఎస్ఐలు చిరంజీవి, హుస్సేన్ లతో కలిసి కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా వారు పట్టణం లో అనుమానస్పద ప్రాంతాలను పరిశీలించారు. ఆయన అసాంఘిక కార్యక్రమాలు పాల్పడే ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తేలేదని తేల్చిచెప్పారు. ప్రతి ఒక్కరూ శాంతియుత జీవనం అవలంబించాలన్నదే పోలీస్‌శాఖ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-తొండూరు: వేసవిలో దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎమ్ వెంకటనారాయణ కోరారు. తొండూరులో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. వేసవి రావడంలో రోజురోజుకు ఎండలతో పాటు ఉష్ణోగ్రతలు కూడా పెరిగిపో తున్నారన్నారు. ఇలాంటప్పుడు దాహార్తి ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రజల దాహార్తిని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వేసవి ముగిసే వరకు చలివేంద్రం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సీసీలు, యానిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.

దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం

విశాలాంధ్ర-యర్రగుంట్ల : వేసవి ఎండల దాహార్తిని తీర్చేందుకు వీలు గా పురపాలిక పరిధిలో దాతల సహకారం తో చలివేంద్రాల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ పగడాల జగన్నాథ్ పేర్కొన్నారు. స్థానిక రైల్వేగేటు సమీపంలోని నిరాశ్రయుల ఆశ్రమం వద్ద శుక్రవారం బాలాజీ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమీషనర్ సొసైటీ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రెండవ వార్డు వైసీపీ ఇన్‌చార్జి వజ్రా డేవిడ్, మున్సిపల్ ఏఈ సందీప్, ఆశ్రమ నిర్వాహకురాలు ఎలిజబెత్‌తో పాటు ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

కృషి, పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

విశాలాంధ్ర-బద్వేల్ : విద్యార్థుల మేధా శక్తికి పదవ తరగతి మొట్టమొదటి మెట్టు అని, అందుకు విద్యార్థులు పదవ తరగతిలో ప్రతిభ చూపించాలని చిన్న కేశం పల్లె జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యా యులు ఏ.వి రమణయ్య పేర్కొన్నారు. బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని చిన్నకేశం పల్లి జిల్లా పరిషత్ పాఠశాల పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవి రమణయ్య మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివితే అద్భుత ఫలితాలు సాధ్యమని, ప్రణాళికతోనే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని పేర్కొన్నారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురి కాకుండా చదవాలన్నారు. దేశ భవిష్యత్తు విద్యార్థులపైనే ఉందని తెలియజేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయులు ఆర్.రామ సుబ్బయ్య మాట్లాడుతూ విద్యార్థులు నిజజీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. అనంతరం నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్ సెక్రటరీ మాదన విజయకుమార్, ఉపాధ్యాయులు పి.సుబ్రహ్మణ్యం, టి.పెంచలయ్య, కె.గంగయ్య, టి.వి.సుబ్బారావు, ఎస్.వరలక్ష్మి, ఎస్.గౌస్ బాషా, ఎన్.సురేష్ రవి కుమార్, ఎస్.శశిధర్ కుమార్, కె.చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీపై అనర్హత వేటు చెల్లదు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : గుజరాత్ రాష్ట్రంలోని సూరత్ కోర్టు రాహుల్ గాంధీపై విధించిన రెండేళ్ల శిక్ష అమలు పై అప్పీలు వెళ్లేందుకు 30 రోజుల గడువు ఇస్తూ బెయిల్ కూడా మంజూరు చేసిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ శుక్రవారం మీడియాకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సదరు కోర్టు విధించిన శిక్ష అమలు ప్రక్రియ నిలిపివేస్తూ తదుపరి కోర్టుకు అప్పీల్ కు వెళ్లేందుకు వెసులుబాటు కల్పించడం న్యాయమైన ప్రక్రియలో భాగమని తెలిపారు. అంతేగాని సదరు శిక్ష మాత్రమే అంతిమం కాదని కానీ భారత దేశాన్ని సర్వనాశనం చేస్తున్న బీజేపీ,ఆర్ఎస్ఎస్ దురాగతాలు అన్యాయాలు అక్రమాలు ఆర్థిక కుంభకోణాలను జాతీయంగా అంతర్జాతీయంగా ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీ పై కక్షపూరితంగా వ్యవహరిస్తూ చేతకాని దద్దమ్మల్లా ఆయనపై లోక్‌సభ సభ్యుడిగా అనర్హత వేటు వేయడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ స్వరాన్ని ప్రశ్నించే తత్వాన్ని మతోన్మాద ప్రధాని మోడీ గాని ఆర్ఎస్ఎస్ గాని ఆపలేరని హెచ్చరించారు. ఆర్ఎస్ఎస్ బిజెపి సమాధి కట్టేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజా క్షేత్రంలోకి వెళుతుందని తెలిపారు. బిజెపి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమై మనుగడ అసాధ్యమని భావించి రాబోయే లోక్‌సభఎన్నికల్లో రాహుల్ గాంధీని కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోలేక ఇలాంటి కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : వైస్సార్సీపీ దళిత నాయకులు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పల్లెకొండు సంపత్ కుమార్ ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో తెలుపుతూ గత 26 సంవత్సరాలుగా దళిత క్రైస్తవులకు యస్ సి హొదా కల్పించాలని కోరుతూ శాంతి యుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం చేస్తున్న దళిత క్రైస్తవుకు యస్ సి హొదా కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలిపారు. క్రైస్తవుల మనవిని ఆలకించి నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభలో ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిన రాష్ట్ర ప్రభుత్వానికి యావత్ క్రైస్తవ లోకం తరపున ప్రత్యేకించి దళిత క్రైస్తవుల తరపున ధన్యవాదాలు తెలియజేస్తునామన్నారు. మతం మారిన కులం మారదు, మతం ఆధ్యాత్మిక అంశం, కులం సామాజిక అంశం. షెడ్యూల్డ్ కులాల వారు రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛను అనుసరించి వారి ఆత్మ ప్రభోధానుసారం ఏ మతాన్నయినా అనుసరించ వచ్చు అని, ఇతర మతం స్వీకరించినంత మాత్రాన వారి సామాజిక ఆర్థిక స్థితిగతులలో మార్పు రాదన్న సత్యాన్ని రాష్ట్ర శాసనసభలో నొక్కి వక్కాణించిన ముఖ్యమంత్రికి క్రైస్తవులందరు ఋణపడి ఉంటామని తెలిపారు.

పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి: చల్లా రాజగోపాల్

విశాలాంధ్ర- ప్రొద్దుటూరు: పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని సీమాంధ్ర బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చల్లా రాజగోపాల్ పేర్కొన్నారు. స్థానిక నందిని క్లాత్ మార్కెట్‌లోని సీమాంధ్ర బీసీ సంక్షేమసంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో చల్లా రాజగోపాల్ మాట్లాడుతూ ఈ ఏడాది

10వ తరగతి పరీక్షలలో 90శాతం పైబడి మార్కులు సాధించిన విద్యార్థిణి, విద్యార్థులకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి సంబంధించిన ఫీజు చెల్లించడమే కాకుండా 10లాంగ్ నోట్ పుస్తకాలు ఉచితంగా అందిస్తానని తెలిపారు. ప్రభుత్వ హైస్కూల్‌లో చదివే విద్యార్థిని, విద్యార్థులకు ప్రతి ఏడాది 10మంది విద్యార్థులకు తన తండ్రి జ్ఞాపకార్థం పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటును అందించాలన్నదే తన ఆశయం అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ ఏడాది జరిగే 10వ తరగతి పరీక్షలలో 90శాతం పైబడి మార్కులు సాధించిన వారు ధరఖాస్తును చేసుకోవాలన్నారు. కుల, మతాలకు అతీతంగా ఈ అవకాశాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. ముందుగా ఎవరయితే ధరఖాస్తు చేసుకుంటారో వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. తన తండ్రి చల్లా శివరామయ్య జ్ఞాపకార్థం ఇప్పటికే అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది నుండి పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలన్న ఆశయం తమ కుటుంబసభ్యులదన్నారు. ఈ సమావేశంలో మారబోయిన శ్రీనివాసులు, ఏసునాథరెడ్డి, రామయ్య, కాటం వీరయ్య, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే క్షయ వ్యాధి దూరం

విశాలాంధ్ర - వల్లూరు : పరిశుభ్రతతోనే క్షయ వ్యాధి దూరమవుతుందని వల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు. శుక్రవారం క్షయ వ్యాధి నివారణ దినోత్సవం లో భాగంగా మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నిర్మూలన కోసం ప్రతిజ్ఞ నిర్వహించారు.వాతావరణంలో పెరిగిపోతున్న దుమ్మధూళి కాలుష్యం వల్ల సంభవించే క్షయవ్యాధి నిర్మూలించాలని, క్షయ రహిత సమాజం అందరి బాధ్యత అంటూ ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని క్షయ వ్యాధి దరిచెరునికుండా అడ్డుకట్ట వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ శివరామిరెడ్డి, సిహెచ్ఓ వేణుగోపాల్, టీబీ మమత స్టాఫ్ నర్స్ అనిత, సూపర్వైజర్ సునీల్ ఏఎన్ఎం నీలావతి, శ్రీదేవి, ప్రజలు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీపై తీర్పు రాజకీయ కుట్రలో భాగమే

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : రాహుల్ గాంధీ పై సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పును యావత్ భారత దేశ ప్రజానికం తీవ్రంగా ఖండిస్తుందని రాజం పేట కాంగ్రెస్ పార్టి నియోజకవర్గ ఇన్చార్జి సోమిశెట్టి మనోహర్ బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పై కేంద్ర ప్రభుత్వం తప్పుడు పరువు నష్టం కేస్ బనాయించి రెండు సంవత్సరాల జైలు శిక్ష విధించడం విడ్డూరంగా ఉందన్నారు. మోదీని విమర్శించినందుకు జైలుకు వెళ్లాలంటే మళ్ళి విమర్శించడానికి దేశంలో ఉన్న కోట్లాది మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. జైలుకెళ్లడానికి క్షమాపణలు చెప్పి పారిపోవడానికి సావర్కర్ వారసులం కాదని ఈ దేశానికి స్వతంత్రం తెచ్చి పెట్టిన కాంగ్రెస్ వారసులం అనే విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు.

విచారణకు వస్త్ర వ్యాపారులు హాజరు

విశాలాంధ్ర-సిద్దవటం : మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన వస్త్ర వ్యాపారులు శుక్రవారం విచారణకు హాజరైనట్లు డిప్యూటీ తహసీల్దార్ రాజేష్ క్రిష్ణ తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటం తహసీల్దార్ కార్యాలయంలో నోటీసులు ఇచ్చిన 10 మంది వస్త్ర వ్యాపారులు విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ 10 మంది వస్త్ర వ్యాపారులు విచారణకు హాజరై వారి వద్దనున్న దస్త్రాలను సమర్పించారన్నారు. అలాగే వస్త్ర వ్యాపారుల వద్ద నుంచి ఉప్పరపల్లి వీఆర్వో స్టేట్మెంట్ రికార్డు చెయ్యడం జరిగిందన్నారు. వారు సమర్పించిన దస్త్రాలను, రెవిన్యూ రికార్డులను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని ఆయన తెలిపారు.

29 నుండి ఆవులపబ్బం

ఆలయం వద్ద చలువ పందిళ్లు- 1న బండలాగుడు పోటీలు

విశాలాంధ్ర- యర్రగుంట్ల : పురపాలిక పరిధిలో శతాబ్దాల క్రితం కొలువుదీరిన శ్రీ ఏరువాక గంగమ్మ తల్లి జాతర (ఆవులపబ్బం) ను ఈ నెల 29వ తేదీ నుండి ఏప్రిల్ 3వ తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. గత కరోనాకు ముందు ఓమారు ఈ ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించిన విషయం తెలిసిందే. సుమారు 5 దశాబ్దాల క్రితం నిలిచిపోయిన ఆవులపబ్బం జాతరను ప్రస్తుతం రెండోదఫా అంగరంగవైభవంగా నిర్వహించేందుకు ఆలయ సేవా సమితి సభ్యులు అహర్నిశలు కృషి చేస్తున్నారు. 29వ తేదీ ఉదయం 6 గంటలకు గ్రామ దేవతలకు పూజలతో జాతరకు అంకురార్పణ జరగనుంది. అందులో భాగంగా 30వ తేదీ మార్కెట్ యార్డు ప్రాంగణంలో సెమీ వృక్షయాగం, 31వ తేదీ అమ్మవారు గ్రామోత్సవం ద్వారా భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఏప్రిల్ 1వ తేదీ పొంగుపాల యాగం జరుగనుంది. ఆ రాత్రి గంగకాటమరాజు కథ కార్యక్రమం మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఉంటుంది. అదే రోజు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఒంగోలు జాతి వృషభరాజములచే బండలాగుడు పోటీలు కొనసాగుతాయి.2వ తేదీ ఆలయం వద్ద పాలేటి యాగంతో పాటు గ్రామ బోనాలు తీయడం, మద్దిమాను నరుకుటతో పాటు బోర్నాముని కథ చెప్పడం జరుగుతుంది. 3వ తేదీ ఉదయం 9 గంటలకు అమ్మవారి దీవెన కథను ప్రొద్దుటూరుకు చెందిన శూలం రామగోవిందు బృందం భక్తులకు వినిపించడం జరుగుతుంది. కాగా జాతరను దృష్టిలో ఉంచుకొని ఆలయ ప్రాంగణంలో సుమారు రూ.2లక్షల ఖర్చుతో జిల్లెల్ల చెన్నకేశవరెడ్డి బ్రదర్స్, జిల్లెల్ల ఆదినారాయణరెడ్డి గ్రానైట్ చప్పట, ఫ్లోరింగ్ రాళ్ల అమరిక పనులను చేపట్టారు. అలాగే రూ.50వేల ఖర్చుతో జిల్లెల్ల సాయిరామిరెడ్డి రేకుల షెడ్డు పనులు పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇక్కడ కొనసాగుతున్న చలువ పందిళ్ల ఏర్పాటు పనులు, ఇతరత్రా వ్యవహారాలను సేవా సమితి ప్రతినిధులు ఎస్.సూర్యనారాయణరెడ్డి, తుపాకుల ఓబుల్‌రెడ్డి, హనుమంతురెడ్డి, తోట శ్రీనివాసులురెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

క్షయ వ్యాధిని నిర్మూలించాలి

విశాలాంధ్ర-కాశినాయన : ప్రపంచ క్షయ నివారణదినోత్స వములో భాగముగా నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రములో క్షయ వ్యాధిని నిర్మూలించాలని వైద్యాధి కారి ప్రశాంతి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్షయ వ్యాధి ని నిర్మూలించ దానికి మందులు ఉచితముగా ప్రభుత్వఆసుపత్రి లో లభిస్తాయని, డాట్ చికిత్సద్వారా టీబి ని సమాజము నుండి పారద్రోల వచ్చని ఆమె అన్నారు. రెండు వారాలు మించిన దగ్గు టీబి కావచ్చని అన్నారు. టీబి వచ్చిన వారు బాధ పడవలసిన అవసరం లేదని, మందులు అందుబాటులో ఉన్నాయని ఆమె అన్నారు.రెండు వారాలు మించి దగ్గు ఉంటే వెంటనే డాక్టర్ ను సంప్రదించాలని వైద్యాధి కారి ప్రశాంతి అన్నారు.టీబి, పరీక్ష లు, మందులు పూర్తిగా ఉచిత మన్నారు. కావున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, గళ్ళ ను బహిరంగ ప్రదేశాలలో ఉమ్మరాదని తెలిపారు. దగ్గేటపుడు, తుమ్మేటపుడు నోటికి రుమాలు అడ్డం పెట్టు కోవా లని తెలిపారు.

రాహుల్‌కు అండగా 130 కోట్ల భారతీయులు

విశాలాంధ్ర- కడప కలెక్టరేట్ : కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాం ధీ పై కేంద్ర ప్రభుత్వం కక్షపూరితం గా వ్యవహ రిస్తూ, అనవసరమైన కేసులతో ఇబ్బంది పెడుతున్న సందర్భంలో పార్టీ అధిష్టానం ఆదేశానుసారం శుక్రవారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఉన్న విశ్వేశ్వరయ్య సర్కిల్ నందు జిల్లా కాంగ్రెస్ నిరసనలకు పిలుపునిచ్చింది. జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రాహుల్ గాంధీకి మేమంతా సంఘీభావం తెలుపుతున్నా మంటూ ఫ్లెక్సీ ప్రదర్శించారు. యదార్థవాది లోక విరోధి అన్న చందంగా రాహుల్ గాంధీ యదార్థాలు మాట్లాడుతుంటే ప్రధాని నరేంద్ర మోడీ కి నచ్చడం లేదన్నారు. నీరవ్ మోడీ, లలిత్ మోడీ ఇలా పేరు చివరన మోడీ అని ఉన్నవారు భారతదేశానికి వేల కోట్లు ఎగవేశారు అని రాహుల్ గాంధీ యదార్థాలు మాట్లాడారన్నారు. కానీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కక్షగట్టి రాహుల్ గాంధీ పై కేసులు బనాయించిందన్నారు. కేసులకు కాంగ్రెస్ పార్టీ భయపడదన్నారు. ఇప్పటికైనా బిజెపి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని హితవు పలికారు. పార్లమెంటు లో అనర్హత వేటు వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మోడీ డౌన్ డౌన్, రాహుల్ గాంధీ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు తో పాటు, నగర అధ్యక్షుడు విష్ణుప్రీతం రెడ్డి, పిసిసి డెలిగేట్స్ బండి జకరయ్య, సత్తార్, యూత్ కాంగ్రెస్ ఆర్టిఐ రాష్ట్ర చైర్మన్ లక్ష్మయ్య, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లం విజయభాస్కర్, రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ గౌడ్, మహిళా జిల్లా అధ్యక్షురాలు శ్యామలాదేవి, నగర అధ్యక్షురాలు లావణ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గొర్ల శ్రీనివాసులు, హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు పాలగిరి శివ, ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడు బాబు, శ్రీరాములు, కృష్ణమూర్తి, జయమ్మ, కణతల ప్రసాద్, సాంబశివుడు, వంశి, ఖయ్యూం, పాల్గొన్నారు.

ఎప్పుడు ఎన్నికలు వచ్చినా టీడీపీ గెలుపు ఖాయం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : రాష్ట్ర ప్రజలు జగన్ పాలనను విశ్వసించే పరిస్థితి లేదని, సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా టిడిపి గెలవడం ఖాయమని, అందుకు నిదర్శనం పట్టభద్రుల ఎన్నికలే అని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గాయత్రి టవర్స్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థులకు బి ఫామ్ ఇచ్చిన మాకు వద్దు బాబోయ్ అనే పరిస్థితి ఉందని, పడి లేచిన కెరటం తెలుగుదేశం పార్టీ అన్నారు. జగన్ నియంతృత్వ ధోరణితో ఆ పార్టీ ఎమ్మెల్యేలలో ఆయన పట్ల వ్యతిరేకత మొదలైందని అన్నారు. 108 నియోజకవర్గాల్లో ప్రజలు వైకాపా కు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారని, మూడు శాసనసభ, శాసనమండలి పట్టభద్రుల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయ దంకా మ్రోగించడం శుభ పరిణామం అని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు 95% నెరవేర్చామని, పట్టబద్రుల ఓట్లు మావి కాదని వైకాపా నేతలు అంటున్నారని, మరి వారి ఓటర్లు ఎవరో తెలపాలన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని అవినీతి సొమ్మును ఎన్నికల్లో పంచి పెట్టారని తూర్పారబెట్టారు. జరిగిన ఎన్నికల్లో టిడిపి బలపరిచిన అభ్యర్థులు గెలవడంతో వైకాపా శాసనసభ్యులు 150 మంది స్వాతంత్రం వచ్చినట్లు సంబర పడుతున్నారని, ఎత్తి చూపారు. ఉద్యోగులకు జీతాలకు గతి లేదు, రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని వైకాపా ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. ఉద్యోగస్తులు, విద్యావంతులు, పింఛన్దారులు, నిరుద్యోగులు చంద్రబాబు పాలనను కోరుకుంటున్నారని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైకాపా కు వ్యతిరేకంగా ఓట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన హెచ్చరించారు. అనంతరం పట్టభద్రుల ఎన్నికల్లో టిడిపి గెలిచినందుకు శ్రీనివాస్ రెడ్డి యువసేన మామిళ్ళ పల్లె ప్రసాద్ నరసరామయ్య గారి పల్లె పండు (కె ఎస్ ఆర్ ఎమ్) ఆధ్వర్యంలో శ్రీనివాసరెడ్డి తో కేక్ కట్ చేయించి బాణ సంచారాలు కాల్చి పూలతో విజయ సంబరాలు జరుపుకున్నారు . రామ్ గోపాల్ రెడ్డి గెలుపుకు కీలక బాధ్యత వహించినందుకు శ్రీనివాసరెడ్డి యువసేన సభ్యులు శ్రీనివాసరెడ్డిని దృశ్యాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రవీణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనాథ్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం: తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లె: ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్, అలాగే ఏపీయూడబ్ల్యుజె జిల్లా మాజీ అధ్యక్షుడు దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్‌పార్టీ మీడియా ఇన్‌చార్జి తులసిరెడ్డి కొనియాడారు. ఇటీవల శ్రీనాథ్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసింది. ఈ నేపథ్యంలో పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం మండలం కోవరగం గుట్టపల్లె గ్రామంలో స్వర్గీయ శ్రీనాథ్‌రెడ్డి భౌతికకాయానికి శుక్రవారం ఆయన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాత్రికేయ వృత్తిలో శ్రీనాథ్‌రెడ్డి అందించిన సేవలను ఆయన కొని యాడారు కార్యక్రమంలో శ్రీనాథ్‌రెడ్డిని నివాళులు అర్పించిన తులసిరెడ్డితో పాటు ఆ పార్టీ నాయకులు ఉత్తన్న, అమర్, నరసిం హారెడ్డి, శివయ్య, నాగార్జున,వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు చేయ డం జరిగిందని పోరుమామిళ్ల మేజర్ సర్పంచ్ యనమల సుధాకర్ పేర్కొన్నారు. శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించిన పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ మాట్లాడుతూ వేసవి కాలం వచ్చేసింది ఎండలు విపరీతంగా ఉన్నాయని ప్రజలకు ఇబ్బంది కలగకుండా పట్టణంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగపరుచుకోవాలి అన్నారు. కేవలం పట్టణ ప్రజలే కాకుండా ఈ ప్రాంతంలోని అన్ని గ్రామాల ప్రజలు పోరుమామిళ్ళకు అవసరార్థమై ఎక్కువ మంది వస్తూ ఉంటారని వారందరూ కూడా ఈ చలివేంద్రాన్ని సద్వినియోగ పరచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవో సుబ్బారెడ్డి, టిడిపి నాయకులు షరీఫ్, సీతా వెంకటసుబ్బయ్య, ఇమామ్ హుస్సేన్, శెట్టెం ప్రతాప్, కృష్ణంపల్లె కృష్ణారెడ్డి, ప్రొఫెసర్ భాష, కృష్ణ, పంచాయతీ క్లర్క్ హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు సృష్టించిన ధీర వనిత అనురాధ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : చేనేత వర్గానికి చెందిన పంచుమర్తి అనురాధ శాసనమండలి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా అనూహ్య విజయం సాధించిన సందర్భంగా కడప నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో తెదేపా పద్మశాలీ సాధికార సమితి, రాష్ట్ర సభ్యులు, మాసా కోదండ రామ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కడపజిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ విచ్చేసారు. ఈ సందర్భంగా మాసా కోదండ రామ్, వికాస్ హరికృష్ణ మాట్లాడుతూ శాసనమండలి ఎమ్మెల్యే కోటా స్థానానికి జరిగిన ఉత్కంఠ భరిత ఎన్నికలో టిడిపి అభ్యర్థి పంచుమర్తి అనూరాధ ఘనవిజయం సాధించారు. విజయానికి అవసరమైన ఓట్ల కంటే ఒక ఓటు అదనంగా లభించింది. అనూరాధ విజయంతో అధికార పార్టీ దూకుడుకు కళ్లెం పడింది. మండలి గెలుపు రాష్ట్ర చరిత్రకు మరో మలుపు.. అదేవిధంగా ఆ స్థానానికి బీసీలలో అత్యంత ప్రధానమైన చేనేత వర్గానికి చెందిన మహిళ పంచుమర్తి అనూరాధగారిని నిలబెట్టడం... పట్టభద్రుల ఎన్నికలో మాదిరి ఎమ్మెల్యే కోటా ఎన్నికలోనూ అభ్యర్థి ఎంపిక ప్రధాన పాత్ర పోషించింది. ఉన్నత విద్యావంతురాలు అయిన అనూరాధ ఎన్నో వేదికలపై పార్టీ గళాన్ని వినిపించారు. ఒక రకంగా చెప్పాలంటే పార్టీ అధినేత చంద్రబాబుకి వీరవిధేయురాలు.. చంద్రబాబు మాటే ఆమె శిరోధార్యంగా భావిస్తారన్నారు. ఈ వేడుకల్లో కడపజిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుధాకర్ యాదవ్, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి కోయలకుంట్ల శ్రీనివాసులు, రాష్ట్ర టీఎన్టీయుసి నాయకులు శ్రీను, కడపజిల్లా యాదవ సాధికార సమితి కన్వీనర్ సుబ్బారాయుడు యాదవ్, కడపజిల్లా బిసి సెల్ అధికార ప్రతినిధి పీర్ల గంగాధర్ యాదవ్, కడప మార్కెట్ యార్డు కమిటీ మాజీ డైరెక్టర్ ఖాసీం, కమలాపురం బిసి సెల్ అధ్యక్షుడు గంగాధర్ యాదవ్, టీడీపీ నాయకులు బొజ్జ ఓబయ్య యాదవ్, బాలక్రిష్ణ, కుమార్, శివయ్య, వేంకట సుబ్బయ్య, సుబ్బారావు పాల్గొన్నారు.

జంగాలపల్లి భాదితులకు రూ.50 వేలు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర- సిద్దవటం : జంగాలపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఇద్దరు భాదితులను పరామర్శించి ఒక్కొక్కరికి రూ.50 వేలు ఆర్థిక సహాయాన్ని ఉప మండలాధ్యక్షులు నారపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి అందజేశారు. జంగాలపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ భాదితులను ఆదుకుంటామని సిద్దవటం ప్రెస్ గ్రూపుకు ఇచ్చిన హామీ మేరకు శుక్రవారం రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పాలెం లక్షుమ్మ ను పరామర్శించి రూ.50 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. అలాగే కడప నగరంలోని హిమాలయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కోటపాటి ఓబులమ్మ ను పరామర్శించి రూ.50 వేలు ఆర్థిక సహాయాన్ని సిద్దవటం మండల ఉపాధ్యక్షులు నారాపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, ఎల్లారెడ్డి, ఆలం క్రిష్ణ చైతన్య, కుప్పం సుబ్బారెడ్డి, నిమ్మకాయల ప్రసాద్ రెడ్డి, రామిరెడ్డి ఓబుల్ రెడ్డి, ఉమా మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేక దృష్టి సాధించాలి

విశాలాంధ్ర - కమలాపురం : నిరుద్యోగ యువతకు ఉచిత డ్రైవింగ్ నేర్చుకునే వారు ట్రాఫిక్ నియమ నిబంధనలపై ప్రత్యేక దృష్టి పెడితే సులువుగా వాహన లైసెన్స్‌కు ఉత్తీర్ణత సాధిస్తారని కడప ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం లక్ష్మి దుర్గా టెక్నికల్ డ్రైవింగ్ స్కూల్ నందు ముఖ్యఅతిథిగా కడప ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసులు హాజరయ్యారు. డ్రైవింగ్ శిక్షణ పొందుతున్న యువతి యువకులకు డ్రైవింగ్ శిక్షణ పై పలు అంశాలను ఆయన ప్రత్యేకంగా తెలిపారు. సీడ్ ఆర్థిక సహకారంతో అభయ ఫౌండేషన్ మదర్ థెరిసా సేవాసమితి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత డ్రైవింగ్ స్కూల్ శిక్షణ తరగతులు అంతకుముందే ఆయన మాట్లాడుతూ ఎల్ఎల్ఆర్ అనేది పర్మనెంట్ లైసెన్స్ కాదని తాత్కాలికమన్నారు. మదర్ థెరిసా సేవా సమితి ట్రస్ట్ చైర్మన్ జూటూరు విజయకుమార్ మాట్లాడుతూ ఇప్పటివరకు 15 మంది యువకులకు ఎల్ఎల్ఆర్ అందాయన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ దుర్గ టెక్నికల్ డ్రైవింగ్ స్కూల్ అధినేత సుబ్బరాజు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా



హెూంగార్డు కుటుంబాలకు ఆర్థికసాయం

విశాలాంధ్ర-కడప క్రైం : జిల్లా పోలీసు కార్యాలయంలో ఏ.ఆర్.ఎస్.ఐగా విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మరణించిన ఎక్కల దేవీప్రసాద్ కుటుంబానికి ఎస్పీ అన్బురాజన్ రూ.2 లక్షల ఆర్థిక సాయాన్ని, రూ.25 వేల ఫ్లాగ్ ఫండ్ మొత్తాన్ని చెక్కు రూపంలో శుక్రవారం 'జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏ.ఆర్.ఎస్.ఐ సతీమణి లెక్కల దేవిప్రకాశమ్మకు అందచేశారు. పోలీస్ వితరణ నిధి నుండి ఈ ఆర్ధిక సాయం అందచేశారు. అనారోగ్యంతో మరణించిన హెూంగార్డ్ జి.నందకిషోర్ సతీమణి జి.కృష్ణ కుమారికి రూ.2 లక్షల ఆర్ధిక సాయం అందచేశారు. హెూంగార్డుల సంక్షేమంలో భాగంగా ఈ మొత్తాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ హెూమ్ గార్డు కుటుంబాల యోగక్షేమాలు విచారించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టీ జాబితాలో వాల్మీకుల తీర్మానంపై హర్షం

విశాలాంధ్ర-పులివెందుల టౌన్: బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తూ శుక్రవారం ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో తీర్మానం చేయడం పట్ల వాల్మీకి నాయకుడు, మున్సిపల్ కో ఆప్షన్ మెంబరు చంద్రమౌళి హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా ఆర్థికంగా వెనుకబడి, ఒకే రాష్ట్రంలో ఏజెన్సీ ప్రాంతంలో ఎస్టీలుగా, మైదాన ప్రాతంలో బీసీలుగా పరిగణించబడుత వెనుకబడిన బోయ కాల్మీకులను ఎస్టీలుగా చేరుస్త అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతున్న సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌మోహర్ రెడ్డికి అభినందనలు తెలిపారు. .రాబోయే కాలంలో వాల్మీకి, బోయవారు సీఎం జగన్ వెంటే ఉంటారని తెలియజేశారు.

చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-లింగాల: లింగాల బస్టాండులో ఐకేపీ ఏపీఎమ్ (లింగాల మండల సమాఖ్య) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఎంపీడీఓ సురేంద్రనాథ్ ప్రారంభించారు. ఈ సంర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిరావడంతో ఎండలు భగ్గుమంటున్నాయన్నారు. ఈ ఎండలకు తోడు ఉష్ణోగ్రతలు కూడా అధికమవుతున్నా యన్నారు. ఇటువంటి సమయంలో ప్రజలకు దాహార్తి ఎక్కువగా ఉంటుందన్నారు. చల్లని శీతలపానీయాలు దప్పిక తీర్చలేవన్నారు. కేవలం బానలల్లో నింపిన నీరు మాత్రమే దాహార్తికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. చలివేంద్రానికి బానలు ఉపయోగించడం ఎంతో గొప్ప విషయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

విశాలాంధ్ర-వేంపల్లె: ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగ తుల సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2023 -24 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్కూల్ ప్రిన్సిపాల్ హరిత తెలిపారు. వైఎస్ఆర్ జిల్లాలో వేంపల్లె పాఠశాలలో 40 సీట్లు ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌లో చూడ వచ్చన్నారు. వచ్చే నెల 4వ తేదీ వరకు ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవచ్చ న్నారు. ఏప్రిల్ 16న ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పన్ను బకాయిదారులకు బంపర్ ఆఫర్

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల పట్టణ పరిధిలోని పన్ను బకాయిదారులకు బంపర్ ఆఫర్ ప్రకటించినట్లు మున్సిపల్ కమిషనరు నరసింహారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ పన్ను బకాయిదారుల వెసులుబాటు కోసం వన్‌టైమ్ సెటిల్‌మెంట్ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. 2022-23 వరకు పాత బకాయి, ప్రస్తుత సంవత్సరం పన్ను మొత్తం కలిపి ఈ నెలాఖరుకు చెల్లించే వారికి పాతబకాయిలు కలిగిన ఇంటిపన్నుపై అలాగే ఖాళీస్థలం పన్నుపై వడ్డీ మొత్తం రద్దుచేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పన్ను బకాయిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వాసుని సన్మానించిన యువత

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి రాంగోపాల్ రెడ్డి గెలుపులో కీలక బాధ్యత నిర్వహించిన పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాస రెడ్డి (వాసు)ని "శ్రీనివాస రెడ్డి యువసేన". సభ్యులు ఆయన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఇంచార్జ్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, తెలుగుదేశం సీనియర్ నాయకులు మొహిద్దీన్ సాబ్, తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జియాఉద్దీన్, నగర ఉపాధ్యక్షులు మహమ్మద్ షా, మైనారటీ నాయకులు సయ్యద్ నాయబ్, యువసేన సభ్యులు జహీర్, బాబి,షేక్షా, సూర్య, నిసార్, సుహైల్, యుసుఫ్, తాజు తదితరులు పాల్గొన్నారు.

బాలికా సంరక్షణ అందరి బాధ్యత

విశాలాంధ్ర-యర్రగుంట్ల : సమాజంలో బాలికా శిశు సంరక్షణ అందరి బాధ్యత అని ప్లానింగ్ కోఆర్డినేటర్ పి.లక్ష్మీనరసింహరాజు సమ్మిళిత విద్యా కోఆర్డినేటర్ కేశవరెడ్డి పేర్కొన్నారు. బాలికలు చదువుకొని ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. బాలికా శిశు సంరక్షణ కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వయస్సు దాటేంత వరకు బాలికలకు వివాహం చేయకూడదన్నారు. ప్రతి ఒక్కరు కనీసం డిగ్రీ వరకు విద్యను అభ్యసించాలన్నారు. ప్రస్తుత సమాజంలో బాలికలు రక్షించబడాల్సి ఉందన్నారు. జీవిత లక్ష్యాలు ఏమిటో విద్యార్థినీల నుండే సమాధానాలు రాబట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసుంధరాదేవి, సీఆర్‌పీ రాజు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోదండరాముని కల్యాణోత్సవంను విజయవంతం చేయాలి

జేసీ సాయి కాంత్ వర్మ, టీటీడీ జెఈవో వీర బ్రహ్మం

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : జిల్లా అధికారులు, టీటీడీ అధికారులు సమన్వ యంతో పనిచేసి ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా ఒంటిమిట్టలో ఏప్రిల్ 5 న జరిగే శ్రీ సీతారాముల కల్యాణోత్సవం ను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.ఎం.సాయి కాంత్ వర్మ, టీటీడీ జెఈవో వి.వీర బ్రహ్మంలు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక టిటిడి కళ్యాణ మండపం సమీపంలోని పరిపాలన భవనం సమావేశపు హాలులో టీటీడీ జెఈఓ వీరబ్రహ్మం, శిక్షణ కలెక్టర్ రాహుల్ మీనా, కడప, బద్వేలు ఆర్డీఒ ధర్మచంద్రా రెడ్డి, వెంకటరమణ లతో కలిసి ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవ ఏర్పాట్లపై జిల్లా అధికారులు, టీటీడీ అధికారులతో జేసి సీఎం సాయికాంత్ వర్మ పనుల పురోగతిపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసి సీఎం సాయికాంత్ వర్మ మాట్లాడుతూ ఏప్రిల్ 5వ తేదీన జరిగే సీతారాములవారి కళ్యాణోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి వచ్చే అవకాశం ఉన్నందున.. పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు ప్రముఖులు, అత్యంత ప్రముఖులు రావచ్చనే అంచనాతో అన్ని రకాల ఏర్పాట్లను ప్రణాళికా సిద్ధం చేయాలన్నారు. త్రాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు ఏర్పాటు చేయాలని, భద్రత, పార్కింగ్, అన్నప్రసాదాల పంపిణీ, తాత్కాలిక మరుగుదొడ్లు, అంతరాయం లేని నిరంతర విద్యుత్ సరఫరా, ప్రథమ చికిత్స కేంద్రాలు, ఆర్టీసీ బస్సుల ఏర్పాటు, హెల్ప్ డెస్క్ లు, సైన్ బోర్డులు, పారిశుధ్యం, విఐపి పాసులు, పార్కింగ్ ప్రదేశాలు, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాట్లను సంబంధించి కమిటీలు బాధ్యత గా ఏర్పాటు చేయాలన్నారు. టీటీడీ జెఈవో వి. వీరబ్రహ్మం మాట్లాడుతూ..టీటీడీ అధికారులు, జిల్లా లోని అన్ని విభాగాల అధికా రులను సమన్వయం చేసుకుని మార్చి 31వ తేదీ లోగా కల్యాణ వేదిక వద్ద సిసి కెమెరాలు ,కంట్రోల్ రూమ్, బ్యారికేడ్లు , గ్యాలరీలు, విద్యుత్ ఇతర పనులు పూర్తి చేయాలని ఆదేశం చారు. ఈ నెలాఖరులో మరోసారి పనుల పురోగతిపై క్షేత్ర స్థాయి సమీక్ష నిర్వహిం చనున్నట్లు ఏఈవో వివరించారు. అనంతరం ఏఎస్పీ తుషార్ దూడే మాట్లాడా రు. ఈ కార్యక్రమం లో కడప, బద్వేలు ఆర్డీవోలు ధర్మచంద్రా రెడ్డి, వెంకటరమణ, డ్వామా, డిఆర్డీఏ, మెప్మా పీడిలు యదుభూషన్ రెడ్డి, ఆనంద్ నాయక్, రామ్మోహన్ రెడ్డి, డీఎస్పీ శివారెడ్డి, వ్యవసాయ శాఖ జేడి నాగేశ్వరరావు, సమగ్ర శిక్ష ఏపిసి ప్రభాకర్ రెడ్డి, డీపీఓ ప్రభాకర్ రెడ్డి, జెడ్పీ సీఈవో సుధాకర్ రెడ్డి, ఆర్అండ్‌బిఎస్ఈ మహేశ్వర రెడ్డి, జిల్లా టూరిజం అధికారి, టీటీడీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని రిటైర్డ్ తెలుగు అధ్యాపకులు నాగప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం గురుకుల విద్యాపీట్ 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ, యూకేజీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు కాన్వకేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు, క్రీడల్లో రాణించాలని పిలుపు నిచ్చారు. యూకేజీ, ఐదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికె ట్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏ వి ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వెంకటేశ్వర్లు, డైరెక్టర్ వీర కుమారి, వివేకానంద, పల్లవి, ఏడి చంద్ర మోహన్, ప్రధానోపాధ్యాయులు ముని చంద్ర, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణ మనందరి బాధ్యత:డాక్టర్ ప్రదీప్

విశాలాంధ్ర-పులివెందుల: క్షయ వ్యాధి నిర్మూలన మనందరి బాధ్యతని జిల్లా ఇన్‌ఛార్జ్ డిప్యూటీ డిఎం హెచ్ఓ డాక్టర్ ప్రదీప్, పులివెందుల ప్రాంతీయ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ డేవిడ్ సెల్వన్ రాజు పేర్కొన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా పులివెందుల పట్టణంలో శుక్రవారం క్షయ వ్యాధి ఓడిపోతుంది- దేశం గెలుస్తుంది అనే అంశం పై అవగా హనా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ఆసుపత్రి నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ లో టి బి ఓడిపోతుంది - దేశం గెలుస్తుంది, క్షయ వ్యాధి నివారణ మనందరి బాధ్యత, టి బి వ్యాధి ని అరికడదాం అనే నినాదాలతో పూల అంగల్ల కూడలికి చేరుకుని అక్కడ మానవహారం గా ఏర్పడి క్షయ వ్యాధి నివారణ కొరకు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ హిమబిందు, సెమీ ఉల్లా, శివశంకర్, నల్లపు రెడ్డి పల్లిసి హెచ్ఓ కృష్ణవేణి, సూపర్ వైజర్ సతీష్, టి బి సూపర్ వైజర్ నాగుల నాయక్, టి బి కౌన్సిలర్ భాగ్యలక్ష్మి, టెక్నీషియన్ రాధ, పొగాకు కౌన్సిలర్ సుమలత, ఐసీటీసీ, ఎస్‌టిఐ కౌన్సిలర్‌లు వెంకటసుబ్బయ్య, బాదల్ వల్లి, ఏ ఎన్ ఎం లు, ఆశా కార్యకర్తలు, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, నేత్రనిధి టెక్నీషియన్ హరీష్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌పై అనర్హతవేటు చట్ట విరుద్ధం: తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లె: కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడం చట్ట విరుద్దమని ఆ పార్టీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్‌పై ఐదేళ్లు శిక్ష విధిస్తూ సూరత్ కోర్టు తీర్పునివ్వడం దురదృష్టకరమన్నారు. ఈ తీర్పుపై పైకోర్టును ఆశ్రయించడం జరుగుతుందన్నారు. హైకోర్టు శిక్ష రద్దు చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మేజిస్ట్రేట్ కోర్టు అపీల్ చేసుకునేందుకు నెలరోజులు గడువు ఇవ్వడం అవకాశం కలిసొచ్చిందన్నారు. ఈ లోపు అనగా తీర్పు మరుసటి రోజే లోక్‌సభ సెక్రటేరియట్ రాహుల్‌గాంధీ లోక్‌సభ రద్దు చేస్తూ అనర్హత వేటు వేస్తూ సర్క్యులర్ జారీ చేయడం అన్యాయమన్నారు. ఇది రాహుల్‌గాంధీ కక్షచర్య సాధింపుకాక మరేమీలేదన్నారు. ఈ చర్యలు రాజ్యాంగపరంగా చట్టపరంగా కాంగ్రెస్‌పార్టీ ఎదుర్కొంటుందని తులసిరెడ్డి వెల్లడించారు. ఇలాంటి కక్షసాధింపు చర్యలకు కాంగ్రెస్ అదరదు బెదరదు అని తెలిపారు.

ముమ్మరంగా కొత్త పైపు లైన్‌కు కనెక్షన్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగరం లోని బండి కనుమ నుంచి మాసాయి పేట సర్కిల్ వరకు అమృత్ స్కీం పథకంలో భాగంగా కొత్త పైపులైనుకు కనెక్షన్ పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ డి ఈ కరీముల్లా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర అభివృద్ధిలో భాగంగా మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ ఐఏఎస్ వారి ఆదేశాల మేరకు 450 డిఐ లైన్ ఏసి 350 కి ఇంటర్ కనెక్షన్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ పైపులైన్ కనెక్షన్ ద్వారా ఆ చుట్టుపక్క వున్న ప్రాంతాల వారికి నీటి సరఫరా సులువుగా ఉంటుందని తెలిపారు.

వైకాపా అహంకారానికి చెంపపెట్టు: టీడీపీ

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు విజయం చేకూర్చడం ఎంతో అభినందనీయం అని, విజయం వైసీపీ అహంకారానికి చెంపపెట్టు అని టీడీపీ నియోజికవర్గ ఇంచార్జ డా.జీవి ప్రవీణ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ప్రవీణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి మొదలు ప్రొద్దుటూరు ఎమ్మెల్యే సైతం తెలుగుదేశం పార్టీ పట్ల, చంద్రబాబు నాయుడు పట్ల అహంకార భావంతో మాట్లాడటం ప్రజలు జీర్ణించుకోలేని పరిస్థితి అన్నారు. జగన్ పాదయాత్రలో ఒక్క ఛాన్స్ ఇవ్వాలని కోరడంతో తన తండ్రి వైఎస్సార్‌ను చూసి ప్రజలు ఆదరించి 151స్థానాలు గెలిపిస్తే రాష్ట్ర ప్రజలకు చేసిందేమిలేదన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడి వేలకోట్లు సంపాదించుకొని ఎన్నికల సమయంలో డబ్బు పారిస్తే ఓట్లు వేస్తారని అనుకోవడం వైకాపా నాయకులకే చెల్లుతుందన్నారు. నీతి నిజాయితి గత వ్యక్తులను ప్రజలు ఎన్నుకుంటారనడానికి నిదర్శనం నిన్న జరిగిన పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికలే నిదర్శనం అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు షరీఫ్ పాల్గొన్నారు.

'కేజీబీవీలలో ప్రవేశం కోసం దరఖాస్తుల స్వీకరణ

విశాలాంధ్ర-పులివెందుల: కస్తూర్భాగాంధీ బాలికా విద్యాలయాల్లో 6, 11వ తరగతుల్లో ప్రవేశం కోసం, 7, 8, 9 తరగతుల్లో మిగి లిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తు న్నట్లు ఎవఎంఈఓ వీరారెడ్డి తెలిపారు. ఆన మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 352 కస్తూర్భాగాంధీ విద్యాలయాల్లో 2023-24 విద్యా సంవత్సరానికి గానూ ఆన్లైన్లో దర ఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు.ఈనెల 27 నుంచి ఏప్రిల్ 20 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్ (బడి మానేసిన వారు) పేద, ఎస్.సి, ఎస్.టి, బీసీ, మై నారిటీ, బి.పి.ఎల్ బాలికలు మాత్రమే దర ఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆన్లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే అడ్మిషన్ కోసం పరిగణిస్తామని చెప్పారు. మరిన్ని వివరాల కోసం 9494383617, 9441270099, 9441214607, 9490782111 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

జెఎన్‌టియులో వార్షిక అథ్లెటిక్స్ పోటీలు

విశాలాంధ్ర-పులివెందుల: స్థానిక జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం అథ్లెటిక్స్ పోటీలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ వార్షిక పోటీలను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.వసుంధర, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రమణారెడ్డి, స్పోర్ట్స్ ఇంచార్జ్ డాక్టర్ ఏ.దామోదర్ రెడ్డి, స్పోర్ట్స్ సెక్రటరీ బి.జోజి రెడ్డిలు ప్రారంభించారు. ఇందులో వివిధ విభాగాలలో విద్యార్థులు పాల్గొన్నారు. వంద మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు రన్నింగ్, షాట్‌పుట్, త్రోబాల్ తదితర పోటీలన ఏర్పాటు చేశారు. ఇందులో విజేతలకు మెడల్స్ అందించి అనంతరం వారిని సత్కరించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపక, ఆధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి సహకరించాలి

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల పట్టణ అభివృద్ధికి భూయజమానసులు సహకరించాలని ఆర్డీవో వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక మున్సిపల్ కారాయల యంలో శుక్రవారం భూయజమానులతో పరిహారం విషయమై ఆయన సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో రింగ్‌రోడ్డు చుట్టూ కొంత మంది భూములను కోల్పోతున్నారన్నారు. భూములు కోల్పోయిన రైతులకు పూర్తి స్థాయిలో ప్రభుత్వం పరిహారం అందిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైసీపీ పులివెందుల ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి, తహశీల్దార్ మాధవకృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనరు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని నిర్మూలిద్దాం

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుంచి ర్యాలీగా పురవీధుల గుండా వెళ్లి మఠం ఐదు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించి క్షయ వ్యాధి నిర్మూలనపై నినాదాలు చేశారు. ఈ సంధర్భంగా డా.సంపత్‌కుమార్ మాట్లాడుతూ పిల్లలకు కాని, పెద్దలకు కాని రెండు వారాలకు మించి దగ్గు ఉన్న, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనపడితే నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్‌ను సంప్రదించి గళ్ల పరీక్ష మరియు చికిత్స చేయించుకోవాలని సూచించారు. క్షయ వ్యాధితో బాధపడుతున్న వారు మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఫల్గుణిరాజ్, హెల్త్ సూపర్‌వైజర్లు పుష్పరాజ్, ఎల్.రమణమ్మ, హెల్త్ అసిస్టెంట్ మాధవనాయుడు, వెంకటసుబ్బయ్య, రక్తపరీక్ష అధికారి రమణకుమార్, స్టాఫ్ నర్సులు, ఏఎన్‌ఎంలు, పాల్గొన్నారు.

రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే మేడా

విశాలాంధ్ర-సిద్దవటం : రంజాన్ మాసం శుభాల వసంతమని రాజంపేట శాసనసభ్యులు మేడా వెంకట మల్లికార్జున్ రెడ్డి అన్నారు. రంజాన్ ఒక మహత్తర మాసమని, ఈ పేరు వినగానే మనస్సు భక్తితో, ఆనందంతో పులకరిస్తుందన్నారు. ఈ మాసంలోనే పవిత్ర ఖురాన్ గ్రంథం అవతరించిందని, రోజా (ఉపవాస వ్రతం) ఆరాధనను దైవం ఈ మాసంలోనే నిర్ణయించి నందున ఈ మాసానికి పవిత్రత, గొప్పదనం వచ్చాయన్నారు. నెల రోజుల పాటు భక్తి శ్రద్ధలతో కఠోర ఉపవాసాలు చేయడం మహా పుణ్య కార్యమన్నారు. ఈ మాసం వాతావరణమంతా పుణ్యకారం, దైవభీతి అనే సుగుణాలతో నిండాలని,ఈ పవిత్ర రంజాన్ మాసం మానవాళికి శాంతి సందేశం అందించాలని, అందరి ఇంట సుఖశాంతులు నిండాలని, రంజాన్ శోభతో నూతన అన్నమయ్య జిల్లా విరాజిల్లాలని ఆయన ఆకాంక్షించారు.

గేటు వసూళ్ల వేలం వాయిదా

విశాలాంధ్ర-యర్రగుంట్ల : స్థానిక పురపాలిక దినసరి మార్కెట్ గేటు వసూళ్లకు సంబంధించిన వేలంపాట వాయిదా పడింది. వేలంకు సంబంధించి ఇరువురు కాంట్రాక్టర్లు మాత్రమే ముందుకు వచ్చారు. అయితే గతంలో కాంట్రాక్టర్లు వేలంపాటను దక్కించు కొని అందులో అరకొర మొత్తాలను జమ చేయడం, మిగిలిన సొమ్మును చెల్లించకుండానే కాలయాపన చేస్తుండడంతో ఈమారు ఉన్నతాధికారుల అనుమతితో కొత్త నిబంధనలు తీసుకువచ్చారు.ఆ మేరకు పాట దక్కించుకున్న కాంట్రాక్టరు సదరు మొత్తాన్ని మూడు రోజులలోపు చెల్లించని పక్షంలో దరావత్తుకు సంబందించిన రూ.5లక్షలు కూడా కోల్పోవాల్సి ఉంటుందన్న నిబంధన తీసుకువచ్చారు. దీంతో బెంబేలెత్తిన చాలా మంది ఔత్సాహిక కాంట్రాక్టర్లు ఈమారు ముందుకు రాలేదని చెప్పవచ్చు. అదే సమయంలో తాజా మాజీ కాంట్రాక్టరే బినామీ వ్యక్తి పేరుతో తిరిగి కాంట్రాక్టు దక్కించుకొనే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కాగా పురపాలిక అధికారులు ఈమారు సర్కారు వేలంపాటను రూ.15,33,700లుగా నిర్ణయించడం కూడా గమనార్హం. శుక్రవారం వేలంపాట ప్రారంభం కాగానే సర్కారు పాట పెద్దమొత్తంగా ఉన్న నేపథ్యంలో కాంట్రాక్టర్లు మౌనం దాల్చడం జరిగింది. దీంతో కమీషనర్ పగడాల జగన్నాథ్ పాటను శనివారం సాయంత్రం 4 గంటలకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ పుల్లయ్య, ఆర్ఓ గంగిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

విశాలాంధ్ర-అట్లూరు : బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని చిన్న కేశం పల్లె జిల్లా పరిషత్ పాఠశాల తెలుగు ఉపాధ్యా యులు మాదన విజయకుమార్ పాఠశాలలో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో పదవ తరగతి విద్యార్థులకు విద్యాసామాగ్రి అంద జేశారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు పదవ తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధన కోసం విద్యార్థులు ఒత్తిడి లేకుండా ప్రణాళికా బద్ధంగా చదవాలని సూచించారు. ఉపాధ్యా యుల సూచనలు పాటిస్తూ ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని ఆయన పేర్కొన్నా రు. విద్యార్థులు బాగా చదువుకునే విధంగా వారి, తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలని కోరారు. విద్యార్థులు చదువుకున్న పాఠశాలకు ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు కష్టపడి చదివి మంచి పేరు తీసుకురావాలన్నారు. తెలుగు ఉపాధ్యాయులు మాద న విజయకుమార్ ప్రతి సంవత్సరం పదవ తరగతి విద్యార్థులకు విద్య సామాగ్రిని అందజేస్తూ, విద్యార్థులకు స్ఫూర్తి నింపుతున్నారు.

ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టులు భర్తీ చేయాలి : డీవైఎఫ్ఐ

విశాలాంధ్ర-బద్వేల్ : జిల్లా వ్యాప్తంగా ఎస్సీ ఎస్టీ బీసీ సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టులను అలాగే ఎస్సీ ఎస్టీ బ్యాక్లాగ్ పోస్టులను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయంలో పట్టణ ఉపాధ్యక్షులు ఎస్.కె మహబూబ్ షరీఫ్ నాయకులు జీవి రమణారెడ్డి వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకులు పొంగూరు నాగరాజులతో కలిసి సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా సాంఘిక సంక్షేమ మరియు వెనుకబడిన వసతి గృహాలలో ఖాళీగా వార్డెన్ పోస్టు ఉన్నాయని వాటిని తక్షణమే భర్తీ చేయాలని వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న ఎస్సీ ఎస్టీ బ్యాక్లాగ్ పోస్టులను తక్షణమే చదువుకున్నటువంటి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి వాటిని వెంటనే భర్తీ చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని జిల్లా అధికారులను కోరారు. ఇప్పటికైనా జిల్లాలో ఉన్నటువంటి ఖాళీ పోస్టులను భర్తీ భర్తీ చేయాలన్నారు లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు తెలియజేశారు.

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన భూపేష్

విశాలాంధ్ర-జమ్మలమడుగు : పెద్దముడియం మండలం సుద్ద పల్లె గ్రామంలో ఇటీవల కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న మొక్క జొన్న , నూగు, మిరప, తెల్ల కుసుమ, కొర్ర, కంది, పంట పొలాలను శుద్ధపల్లె, జంగాలపల్లి, జె.కొట్టాల పల్లె, పాలూరు, గ్రామల రైతులతో కలిసి పరిశీలించిన జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి, ఈ సందర్భంగా భూపేష్ రెడ్డి మాట్లాడుతూ పంటలను నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, భయపరెడ్డి, జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, బయ్యపురెడ్డి,అధిక సంఖ్యలో రైతులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన ఏపీసీ

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : కడప జిల్లా ఒంటిమిట్ట మండల పరిధిలోని కొత్త మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఏపీసి అంబవరం ప్రభాకర్ రెడ్డి ఆకస్మిక తనిఖీ నిర్వ హించారు. పాఠశాలలోని ఉపాధ్యాయులతో సమావేశం నిర్వ హిం చారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సమ యం లో చేపట్టవలసిన సూచనలు, సల హాలు, మెల కువ లను తెలి య జేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యు రాలు నాగలక్ష్మి , బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

NAME CHANGE

I **SYED AAHIL (Old Name)** S/o SHAIK MAHABOOB BASHA resident D.No.2/361, Sastri Nagar, Akkayapalli, Kadapa City, YSR Kadapa Dist. Is hereby declared that I have changed my surname as **SHAIK AAHIL (New Name)** hereafter call all purpose in future.

విశాలాంధ్ర
అన్నమయ్య జిల్లా



ప్రతిభతోనే తగిన గుర్తింపు

విశాలాంధ్ర-నందలూరు :: ప్రతిభ ద్వారా తగిన గుర్తింపు లభిస్తుందని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ అన్నారు. నందలూరు రైల్వే ఇన్స్టిట్యూట్లో స్వర్ణాంధ్ర మదర్ ల్యాండ్ విక్టరీ రోవర్ క్రూ అసోసియేషన్ 24వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రధాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జంబు సూర్యనారాయణ మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడా సాంస్కృతిక పోటీలలో రాణించాలన్నారు. గత 30 సంవత్సరాలుగా సామ్రాజ్య చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమం ఎంతో గొప్పదన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు వేపగుంట సామ్రాజ్ ప్రభుత్వవైద్యులు వీరేందర్ సింగ్ మాజీ ఎంపీటీసీలు స్వామి ఏనుమలై భీమా మునిస్వామి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పులి భాస్కరయ్య ప్రభుత్వ ఉపాధ్యాయులు రోఫ్ భాషా. డాన్స్ మాస్టర్లు. పి ఈ టి లు పాల్గొన్నారు.

వార్డు వాలంటీర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర-రాజంపేట : పురపాలక పరిధిలో గల ఖాళీగా ఉన్న 14 వార్డు వాలంటీర్ల నియామకానికి గాను ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ ఎం.జనార్దన్ రెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. స్థానికులై, ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగి.. 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన నిరుద్యోగులు ఈనెల 24వ తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పోస్టు ఖాళీల తో పాటు ఇతర వివరముల ను పురపాలక కార్యాలయం లోనూ, తపాలా కార్యాల యంలోనూ, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం, తహసిల్దార్ కార్యాలయం ఆర్డిఓ కార్యాలయం తో పాటు అన్ని వార్డు సచివాలయాల యందు నోటీసు బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పీఎం జీవన జ్యోతి భీమా పంపిణీ

విశాలాంధ్ర-గాలివీడు: రోడ్డు ప్రమాదంలో గాయపడి మరణించిన జన్నే లక్ష్మయ్య భార్య లక్ష్మీదేవికి పీఎం జీవన జ్యోతి భీమా రెండు లక్షలు, పీ ఏ ఐ ఎస్ భీమా రూ.50వేలు చెక్కులను నూలివీడు ఎపిజిబి మేనేజర్ బాలాజీ అందజేశారు. శుక్రవారం పూలకుంట గ్రామం గొందిపల్లెకు చెందిన ప్రమాద బాధితులు లక్షమయ్య భార్యకు నూలివీడు బ్యాంకు లో బ్యాంకు సిబ్బంది కుటుంబ సభ్యుల సమక్షంలో చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం జీవన జ్యోతి భీమా పథకం ప్రమాద బాధిత కుటుంబాలకు వరం లాంటిదని అన్నారు. ఈకార్యక్రమం లో ఫీల్డ్ అఫిసర్ రాజమోహన్ రెడ్డి,క్యాషియర్ శివప్రసాద, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్పు కు సంబేపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎస్.జాఫర్ వల్లి, కె.తేజ ఎంపిక అయినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సి.దిలీప్ కుమార్ శుక్రవారం తెలియజేశారు. ప్రతి సంవత్సరం పన్నెండు వేల చొప్పున ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకునాలుగు సంవత్సరాలకు నలభై ఎనిమిది వేలు వీరు అందుకుంటారని ఆయన తెలిపారు. విద్యార్థులు మాట్లాడుతూ ఉపాధ్యా యుల సహకారం, అందించడంతో పాఠశాలలో ప్రత్యేక శ్రద్ధతో కూడిన విద్య చేతనే తాము ఎంపిక అయినట్లు విద్యా ర్థులు తెలియజేశారు. విద్యార్థులను, అలాగే ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ అభినందించారు.

బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్గా వెంకటరామరాజు

విశాలాంధ్ర - రైల్వేకోడూరు: ఆంధ్రప్రదేశ్ బార్ అసోసియేషన్ ఆదేశాల మేరకు రైల్వేకోడూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ప్రశాంతంగా జరిగాయి. ప్రెసిడెంట్ గా అద్దెపల్లి వెంకట రామరాజు, కార్యదర్శి గా కెజెపి రెడ్డెయ్య నాయుడు, జాయింట్ సెక్రటరీ లు గా ఎన్.ఇందిర, సింగమాల నరసింహరావు, కోశాధికారిగా బి.వెంకటరమణయ్య ను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా సిద్ధి లింగం మధుసూధన్ ను నియమించుకున్నారు. ఎక్కడ ఎలాంటి భేదాభిప్రాయాలు తలెత్తకుండా ప్రశాంతంగా బార్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం గా జరిగాయి.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి : విద్యార్థి దశ నుంచి బాగా కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రేఖ పేర్కొన్నారు. శుక్రవారం మోడల్ స్కూల్లో విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల విధానం గురించి పరీక్షలు ఎలా ఎదుర్కోవాలి మంచి మార్కులు సాధించే విధానం పైన విద్యార్థులకు సూచించారు. అనంతరము విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ చేశారు. అనంతరం సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. పల్సర్ బైకు ఎక్కిరాను అనే పాటతో బాలికలు ఉత్సాహంగా నృత్యం ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జమ్రుద్వేగం మురళి నాయక్ భారతి శ్రీనివాసులు ప్రసాద్ అరుణ్ కుమారి శ్రీకళ సుధీర్ కుమార్ సోమశేఖర్ నాయక్ రసూల్ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 30 లోపు హద్దు రాళ్లను పాతాలి

అసైన్మెంట్ భూముల అర్హులను గుర్తించాలి- ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం పక్కాగా చేయాలి: కలెక్టర్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: జిల్లాలో రీసర్వే పూర్తి చేసిన గ్రామాలు, మండలాలలో ఏప్రిల్ 30 లోపు హద్దురాళ్ళను తప్పనిసరిగా పాతించాలని జిల్లా కలెక్టర్ గిరీష పి.ఎస్ తాసిల్దారులను ఆదేశించారు. శుక్రవారం రాయచోటి స్థానిక కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో వివిధ అంశాలపై తాసిల్దార్లతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే సర్వే పూర్తయిన గ్రామాలు, మండలాలలో వెంటనే హద్దురాళ్లను పాతించే కార్యక్రమం మొదలు పెట్టాలని, కనీసం రోజుకు 50 రాళ్ళను పాతే విధంగా తాసిల్దార్లు కృషి చేయాలని సూచించారు. ఆర్డీవోలు ఈ కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించాలన్నారు. మండలంలో డ్రోన్ ఫ్లై ఎక్కడెక్కడ జరుగుతోంది, గ్రౌండ్ కంట్రోల్ పాయింట్లను సరిగా చెక్ చేయాలని చెప్పారు. 22ఏ మరియు ఖాతా సంఖ్యలను పక్కాగా పూర్తి చేయాలన్నారు. 22 ఏ లేయర్ పూర్తి చేయడానికి ముందే క్లరికల్ తప్పులను సరిదిద్దుకోవాలని చెప్పారు. రీ సర్వేకు సంబంధించి తాసిల్దార్లు క్షేత్రస్థాయిలో తరచూ పర్యటనలు నిర్వహించాలని, సర్వే పనుల పూర్తికి మండల సర్వేయర్లను వినియోగించుకోవాలన్నారు. జిల్లాలోని ఓటర్ కార్డులకు ఆధార్ అనుసంధానం ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇందుకు 6(బి) ఫారంలో సంతకాలు పొందాలని సూచించారు. ఈ ప్రక్రియను మార్చి 31వ తేదీ లోపు పూర్తి చేసేలా కృషి చేయాలన్నారు. ఇందుకు ఆదివారం నాడు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి కోర్టులలో పెండింగ్ ఉన్న కేసులకు ఎప్పటికప్పుడు కౌంటర్ అఫడవిట్లు దాఖలు చేయాలని, కంటెంప్ట్ వరకు తీసుకు రావద్దని తాసీల్దార్లను ఆదేశించారు. ఈ విషయంలో ఆయా రెవెన్యూ డివిజనల్ అధికారులు తగు పర్యవేక్షణ చేయాలని కోరారు. అనంతరం వివిధ అంశాలపై చర్చించి తగు సూచనలు జారీ చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయ, రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, మదనపల్లి ఆర్డీఓ మురళి, కలెక్టరేట్ ఏఓ బాలకృష్ణ, తాసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ఆపరేటెడ్ కలుపు నివారణ మెషిన్ తయారీ

విశాలాంధ్ర- మదనపల్లి: రైతులకు ఎంతో ఉపయోగపడే ఈ మెషిన్ ను మెకానికల్ ఇంజనీరిం గ్ మూడవ సంవత్సర ము చదువుతున్న మణి కంఠ, చిన్నారావు లు అతి తక్కువ ఖర్చు తో ఈ మెషిన్ ను సూకూరుపేట కు చెందిన నరేంద్ర అను రైతు కు కావలసిన విధంగా విద్యార్థులు తయారుచేసి ఇచ్చినట్లు ప్రిన్సిపాల్ డా॥ సి.యువరాజ్ తెలిపారు. ఈ ఆటోమేటెడ్ సోలార్ కలుపు నివారణ మెషిన్ అనేది పూర్తిగా సౌర శక్తితో నడిచేది అని అన్నారు. ఇది కొద్దీ స్థాయిలో మట్టిని కూడా గొర్రు గుంటక కు ఉపయోగ పడుతుందని, ఎక్కువగా టమోటా, పత్తి, మిరప మొదలైన పంటలలో ఉపయోగ పడుతుందని అని అన్నారు. కళాశాల నందు తమ మెకానికల్ విద్యార్థులు రైతులకు కావలసిన ఎంటువంటి పరికరనైనా అతి తక్కువ ఖర్చుతో తయారుచేసి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన అన్నారు. తయారు చేసిన విద్యార్థులను మరియు విభాగాధిపతి ని కళాశాల కరెస్పాండెట్ డాక్టర్. యెన్. విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్, అసోసియేట్ డీన్ ఆర్ %డ% డి తులసీరామ్ నాయుడు తదితరులు అభినందనలు తేలియాజేశారు.

అంతటా రంజాన్ శోభ !

భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు- భక్తులతో కిక్కిరిసిన మసీదులు

విశాలాంధ్ర-పీలేరు : ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే పవిత్ర రంజాన్ మాసం ఆగమనంతో అంతటా ప్రత్యేక శోభ సంతరించుకుంది. పీలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో శుక్రవారం నుంచి రంజాన్ సందడి ప్రారంభమైంది. పీలేరు, కలికిరి, కలకడ, కేవీ పల్లె, గుర్రంకొండ, వాల్మీకిపురం మండలాల్లో గురువారం సాయంత్రం రంజాన్ నెలవంక దర్శనంతో ఈ పవిత్ర మాసానికి సంబంధించిన ప్రత్యేకత 'తరావీహ్'(పవిత్ర ఖురాన్ పారాయణంతో కూడిన నమాజు) ప్రార్థనలను ప్రారంభించారు. అలాగే శుక్రవారం వేకువజాము 'సహరి' (ఉపవాస దీక్ష స్వీకరణ) తో ఉపవాసాలను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. సాయంత్రం మగ్రిబ్ నమాజ్ ముందు 'ఇఫ్తారీ'(ఉపవాస దీక్ష విరమణ)తో ఉపవాసాన్ని విరమించారు. ఈ నేపథ్యంలో పిల్లలనుంచి వృద్ధుల వరకు ఉపవాస దీక్షలను ఆచరించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. రంజాన్ మాసంలోని తొలి శుక్రవారం తొలి రోజే రావడంతో మసీదులు భక్తులతో కిక్కిరిసాయి. ధార్మిక గురువులు పవిత్ర రంజాన్ మాసం ఆరాధనలు, ఉపవాసాల ప్రత్యేకతలు , పవిత్ర ఖురాన్ గ్రంథ పారాయణ ప్రయోజనాలు, ఇత్యాది పుణ్యఫలాల గురించి మసీదులలో ధార్మికోపన్యాసాలు చేశారు. ఈ సందర్భంగా మసీదులను ప్రత్యేక విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా అలంకరించారు.

గడి గ్రామంలో రంజాన్ తోఫా

విశాలాంధ్ర-కలికిరి: గడి గ్రామంలో ప్రతి సంవత్సరం లాగా రంజాన్ తోఫా సయ్యద్ జుబేర్ అహ్మద్ వైసీపీ మైనార్టీ నాయకుడు సింగల్ విండో మాజీ చైర్మన్ జామియా మజీద్ ముత్తు వల్లి ఆధ్వర్యంలో సొంత నిధులతో దాదాపు రెండు లక్షల రూపాయలు సరుకులు ఇవ్వడం జరిగింది. జుబేర్ అహ్మద్ గాడి లో అనేక సేవ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. ఈ సరుకుల్లో ఐదు కేజీ గోధుమపిండి ఖర్జూరము కేజీ చక్కెర ఒక కేజీ సేమియాలు ఒక కేజీ పప్పు అలాగే ఫ్రీడం పాకెట్ ఒక కేజీ ప్రజలకు మరియు అందరికీ ఇవ్వడం జరిగింది.400 బ్యాగ్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు జునేద్. ముబారక్ ఖాన్. మునీర్,ఇస్తాక్ నూరు,సేరాజ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ బలోపేతానికి కృషి

విశాలాంధ్ర -రాజంపేట: నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేయడం జరుగుతోందని నియోజకవర్గ ఇన్చార్జ్ మలిశెట్టి వెంకటరమణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గ కేంద్రంలోని అన్ని మండలాల్లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లడం జరిగింది అన్నారు. రానున్న ఎన్నికల్లో జనసేన గెలుపే లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందన్నారు. అమెరికా నుండి తిరిగి రాజంపేటకు విచ్చేసిన జనసేన పార్టీ రాజంపేట అసెంబ్లీ ఇంచార్జ్ మలిశెట్టి వెంకటరమణాను శుక్రవారం రాజంపేట జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన నాయకులు, పవన్ కళ్యాణ్ అభిమానులు, కుల సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ పై కోర్టు తీర్పుని స్వాగతిస్తున్నాం

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: నాలుగేళ్ల క్రితం రాహుల్ గాంధీ బహిరంగంగా తెలి సమాజాన్ని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన సందర్భంలో ఆయనకు ప్రస్తుతం కోర్టు విధించిన శిక్షను స్వాగతిస్తున్నామని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీర్ల శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ కోర్టు దృష్టిలో దేశంలోని పౌరులందరూ సమానమని నిరూపితమైందని అన్నారు. ఎంత పెద్ద వ్యక్తి అయినా నేరం చేస్తే చట్టం నుండి తప్పించుకోలేరని తెలిపారు. కోర్టు శిక్ష విధించినప్పటికీ రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆ కించపరిచే విషయాలను సమర్థిస్తున్న తీరుచూస్తుంటే తెలీ,గాండ్ల, తెలుకుల సమాజంతో సహా మొత్తం ఒబిసి వర్గాల పై కాంగ్రెస్ ఉద్దేశ్యం ఏమిటో చెప్పడానికి సరిపోతుందన్నారు. రాహుల్ గాంధీ ఇంకా రాచరికం నుండి బయటకు రాలేదా అనే సందిగ్ధం నెలకొంటుందన్నారు. కోర్టు తీర్పుతో అయినా ఒబిసి లపై చిన్నచూపు విధానాలు మానుకోవాలన్నారు.

క్షయపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-మదనపల్లి రురల్: డాక్టర్ సునీత, డాక్టర్ ఝాన్సి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మరియు ఆసుపత్రి సిబ్బందితొ కలిసి గ్రామ మంతా ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ సునీత మాట్లాడుతు రెండు వారాలకు మించి దగ్గు,జ్వరం,బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రి యందు గల్ల పరీక్ష చేయించుకోవాలని సూచించారు.ఈ జబ్బుకు మందులు పూర్తిగ ఉచితం అని, 6నెలలు క్రమం తప్పకుండ మాత్రలు వేసుకొంటె జబ్బు పూర్తిగా తగ్గుతుందని సూచించారు. అలాగె డాక్టర్ ఝాన్సి మాట్లాడుతు పేదరికం లొ ఉన్న క్షయ వ్యాధి గ్రస్తులకు పౌష్టికాహారం కొరకు ప్రజలు స్వచందంగా ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం నందు డాక్టర్ సునీత,డాక్టర్ ఝాన్సి,దేవేంద్ర ,అరుణ,అనిత,భాస్కర్ మరియు పాఠశాల ఉపాధ్యాయులు,, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

వేలంపాట ద్వారా పంచాయతీకి రూ.20 లక్షల ఆదాయం

విశాలాంధ్ర కలికిరి: వివిధ వేలం ద్వారా కలికిరి స్థానిక మేజర్ పంచాయతీకి వేలం పాట ద్వారా 20 లక్షల 96 వేల రూపాయలు ఆదాయం సమకూరినట్లు ఎంపీడీవో గంగయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వేలం పాటలో ముఖ్యఅతిథిగా డి ఎల్ పి ఓ జయ కుమారి సమక్షంలో జరిగింది. శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయం నందు వారపు సంత ద్వారా గుత్తేదారుడు అశోక్ కుమార్ రెడ్డి 15 లక్షల రూపాయలకు వారపు సంతను కైవసం చేసుకున్నారు. దినసరి కూరగాయల మార్కెట్ గుత్తేదారు రాజశేఖర్ రెడ్డి 2,11,000 కు వేలంపాట ద్వారా పాడుకోవడం జరిగింది. అలాగే ప్రైవేట్ బస్టాండు గుత్తేదారు రియాజ్ బాష 3 లక్షల పదివేలకు వేలంపాట ద్వారా పాడుకోవడం జరిగింది. జంతు వదశాల షాహిర్ అనే గుత్తేదారుడు 75 వేల రూపాయలకు వేలంపాట ద్వారా పాడుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గంగయ్య డి ఎల్ పి ఓ జయ కుమారి ఈవో ఉదయకుమార్, ఇ ఓ ఆర్ డి అబ్దుల్ ఆజాద్, గుత్తేదారులు తదితరులు పాల్గొన్నారు.

నరహంతక పాలనకు చరమగీతం పాడదాం: బత్యాల

విశాలాంధ్ర-రాజంపేట : జగన్మోహన్ రెడ్డి నరహంతక పాలనకు చరమగీతం పాడాలని., ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల ని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాజంపేట అసెంబ్లీ ఇన్చార్జి బత్యాల చెంగలరాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో "జగనాసుర రక్త చరిత్ర బహిరంగం" అనే పుస్తకాన్ని బత్యాల ఆవిష్కరించారు. అనంతరం పార్టీ కార్యాలయం ఎదుట కార్యకర్తలతో కలిసి వివేకానంద రెడ్డి హత్య కేసు కు సంబంధించి జగన్మోహన్ రెడ్డి చేస్తున్న జిమ్మిక్కుల పట్ల ఆరోపిస్తూ జగన్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ వివేకానంద రెడ్డి హత్య జరిగిన రాత్రి 3 గంటల నుంచి 4 గంటల మధ్యన అవినాష్ రెడ్డి, నవీన్, కృష్ణమోహన్ రెడ్డి లు చరవాణి ద్వారా భారతీ రెడ్డి, జగన్ రెడ్డిలతో ఏం మాట్లాడారో కాల్ డేటా బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. వివేకాను గంటకు పైగా చిత్రహింసలు పెట్టి అతి క్రూరంగా గొడ్డలితో నరికి హత్య చేశారని ఆరోపించారు. హత్యలు చేయిం చడం, ఎదుటివారికి అంటగట్టడం జగన్ రెడ్డి నైజం అని తెలిపారు. ఇలాంటి నరహంతకుల చేతుల్లో మన భవిష్యత్తు క్షేమంగా ఉంటుందా అని ప్రజలు ఆలోచించుకోవాలని అన్నారు. కార్యక్రమం లో టిడిపి పార్లమెంట్ అధికార ప్రతినిధి అద్దేపల్లి ప్రతాప్ రాజు, మండల అధ్యక్షుడు గన్నె సుబ్బ నరసయ్య నాయుడు, నాయకులు, పాల్గొన్నారు.

మా తోట పథకం రైతులకు వరం

విశాలాంధ్ర-సుండుపల్లె : గ్రామీణ ప్రాంతాలలో గిరిజనుల అభివృద్ధి కోసం చేపట్టిన మాతోట పథకం రైతులకు వరంగా మారుతుందని నాబార్డు డిడిఎం విజయ విహారి తెలిపారు. మండల పరిధిలోని మడితాడు పంచాయతి కొలిమిట్ట బిడికి,వానరాచపల్లె ఎగువ, దిగువ బిడికి లలో నాబార్డు సహకారంతో ఆర్ హెచ్ జి బి ఎం ఎస్ ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన మాతోట పథకంలో నాటిన మామిడి,జమ,ఉసిరి వంటి పండ్ల తోటల పెంపకాన్ని శుక్రవారం నాబార్డు డి డి ఎం విజయ విహారి ఆర్ హెచ్ జి బి ఎం ఎస్ ఎస్ ప్రధాన కార్యదర్శి బి వి రత్నం తో కలిసి పరిశీలించారు.ఈ సంధర్బంగా రైతులు తమ పొలాల్లో నాటుకున్న మామిడి మొక్కలను,వాటిలో అంతర పంటగా సాగుచేసిన వేరుశనగ,అలసంద పంటలను పరిశీలించారు. వీటి ద్వారా పొందే ప్రయోజనాలను రైతులను అడిగి తెలుసుకున్నారు.ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ పండ్లతోటలలో అంతరపంటల సాగు వలన ఆదాయం పొంది కుటుంబ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు.అనంతరం రత్నం మాట్లాడుతూ మామిడి తో పాటు నాటిన పండ్ల మొక్కలకు వేసవిలో సకాలంలో నీటి తడులు వేసుకోవాలని సూచించారు.పండ్ల మొక్కలను సరక్షించు కోవాల్సిన బాధ్యత రైతులపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి చంద్రా నాయక్, నరసింహులు, వీరనాగయ్య,రైతులు పాల్గొన్నారు.

మాజీ సీఎంను మర్యాద పూర్వకంగా కలసిన సత్యనారాయణ

విశాలాంధ్ర-పీలేరు: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ని కలసిన కలికిరి, నల్లారి అభిమానులు, ధరణి హెూటల్ యజమాని పులి సత్యనారాయణ రెడ్డి, మిల్క్ డీలర్ శివారెడ్డి, స్టోర్ డీలర్ సత్యారెడ్డి, రైతు అమరనాథ్ రెడ్డి మర్యాద పూర్వకముగా కలవడం జరిగింది ఉమ్మడి ఆంధ్రరదేశ్ లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసిన నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి అని పులి సత్యనారాయణ తెలపడం జరిగినది మళ్ళీ రాజకీయాల్లోకి రావడం హర్షనీయమన్నారు.

అక్రమ కేసుపై న్యాయపోరాటం : కాంగ్రెస్

విశాలాంధ్ర - రైల్వేకోడూరు: కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సభ్యులు రాహుల్ గాంధీ పై పెట్టిన పరువు నష్టం అక్రమ కేసు పై ఉన్నత న్యాయ స్థానాన్ని ఆశ్రయించి న్యాయ పోరాటం కొనసాగిస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు లీలా శ్రీనివాస్ కొండేటి బిజెపి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.శుక్రవారం తమ కార్యాలయం వద్ద పాత్రికేయులు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.చట్ట సభలలో రాహుల్ గాంధీ వేసిన ప్రశ్నలకు సమా ధానం చెప్పలేక ఆయన పై అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నా రని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి అక్రమ కేసులకు భయపడేది లేదన్నారు.ప్రజలతో కలసి ఉద్యమాలను నిర్వహిస్తామన్నారు.నీరవ్ మోడీ,లలిత్ మోడీ దేశం విడిచి పారిపోయారని అలాంటి వారి గురించి మాట్లాడితే కేసులు పెడతారా అని ప్రశ్నించారు.బిజెపి బెదిరింపులకు కాంగ్రెస్ పార్టీ వెనక్కు తగ్గదన్నారు.మోడీ ప్రభుత్వాన్ని ప్రజలు తరిమి కొట్టే రోజులు దగ్గర పడ్డాయన్నారు.జైలు కెళ్లడానికి క్షమాపణలు చెప్పి పారిపోవడానికి సావర్కర్ వారసులం కాదని, ఈ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చి పెట్టిన కాంగ్రెస్ వారసులం అని గుర్తు పెట్టుకోవాలన్నారు.

కర్ణాటక మద్యం సీజ్..

విశాలాంధ్ర-మదనపల్లి: కారు సహా రూ.2 లక్షల విలువైన కర్ణాటక మద్యాన్ని మదనపల్లె రూరల్ పోలీసులు సీజ్ చేసి నిందితుడిని అరెస్టుచేశారు. నిధితుడి అరెస్టుకు సంబంధించి రూరల్ సీఐ సత్యనారాయణ ఎస్సైలు చంద్రశేఖర్ సుధాకర్ కథనం మేరకు.. కోలార్ జిల్లా, శ్రీనివాసపురం తాలూకా గుంటిపల్లికి చెందిన రాము25 తన కారులో రూ. లక్ష విలువచేసే 816 కర్ణాటక మద్యం ప్యాకెట్లు తీసుకుని మదనపల్లెకు బయల్దేరాడన్నారు. ఈ మేరకు అందిన పక్క సమాచారంతో స్థానిక బెంగళూరు రోడ్డులోని వేంపల్లి క్రాస్ వద్ద ఎస్ఐ చంద్రశేఖర్ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా శుక్రవారం ఉదయం ఇండికా కారులో 816 టెట్రా కర్ణాటక మద్యం ప్యాకెట్లు తీసుకుని మదనపల్లికి వస్తుండగా తనిఖీల్లో నిందితుడుతో సహా కారు కర్ణాటక మద్యాన్ని పట్టుకుని సీజ్ చేసి నిందితుని స్టేషన్కు తీసుకురావడం జరిగింది అన్నారు. అతనిపై అక్రమమద్యం తరలింపు పై కేసు నమోదు చేసి అరెస్టు చేసి స్థానిక కోర్టులో హాజరు పరచడం జరిగిందని ఎస్ఐ పేర్కొన్నారు.

అనురాధ విజయంపై సంబరాలు

విశాలాంధ్ర-గాలివీడు: శాసన సభ్యుల ఎన్నికల్లో పంచుమర్తి అనురాధ ఎమ్మెల్సీ గా ఎన్నిక కావడంపై మండల కేంద్రంలో టీడీపీ నాయకు లు కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.శుక్రవారం స్థానిక గాలివీడు బస్టాండ్లో టీడీపీ నాయకులు టపాసులు పేల్చి మిఠాయిలు పంచి పెట్టి ఘనంగా విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ ఎంపిపి వెంకట నారాయణ రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో,ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరుస విజయాలతో టీడీపీ విజయదుందిబి మ్రోగించిందని, రానున్న సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ అఖండ విజయం సాధిస్తుందని అన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ పార్థసారథి రెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు లక్ష్మయ్య, మాజీ సర్పంచ్ లు చిన్నపరెడ్డి, భద్రప్ప,మాజీ వక్ఫ్ బోర్డ్ సభ్యులు మహబూబ్ బాషా,టీడీపీ నాయకులు డాక్టర్ రామచంద్రారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి,రమేష్ బాబు,భాస్కర్ రెడ్డి,జనార్దన్, రామాంజులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై స్పందించిన సీఎంకు కృతజ్ఞతలు

విశాలాంధ్ర-చిట్వేలి : రైల్వేకోడూరు నియోజక వర్గం చిట్వేలి మండల సమస్యల పట్ల స్పందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డినీ రైల్వే కోడూరు ఎం ఎల్ ఏ కోరముట్ల శ్రీనివాసులు వైఎస్సార్సీపీ నాయకుడు ఎల్ వి మోహన్ రెడ్డి చిట్వేలి మండల కన్వీనర్ ఎంపిపి ఉపాధ్యక్షులు చెవ్వు శ్రీనివాసులు రెడ్డితదితరులు సీఎం కు కృతజ్ఞతలు తెలియజేశారు. శుక్రవారం అసెంబ్లీ హాలులో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్బంగా నియోజకవర్గం మరియు మండల అభివృద్ధి పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని ఎఫ్టిఆర్ బిల్లు లను సచివాలయం బిల్లులు గురించి సీఎం దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. తాము ఆదినుంచి వైఎస్సార్ కుటుంబానికి విరవిధేయులుగా ఉన్నామని పార్టీ బలోపేతానికి తమవంతు కృషి చేస్తున్నామని కన్వీనర్ శ్రీనివాసులు రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అభినందనీయులన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికలలో బయట వ్యక్తుల ప్రమేయాన్ని ఖండిస్తున్నాం

విశాలాంధ్ర-రాజంపేట: ఈనెల 31వ తేదీన జరగనున్న బార్ అసోసియేషన్ ఎన్నికలలో బయటి వ్యక్తుల ప్రమేయాన్ని ఖండిస్తున్నట్లు యువ న్యాయవాదులు పేర్కొన్నారు. ఏనాడు కోర్టుకు రాని, వకాలత్ లేని కొంతమంది న్యాయవాదులు బయటి వ్యక్తులను బార్ గదిలోకి తీసుకొని వచ్చి యువ న్యాయవాదులపై దాడి చేయడం బాధాకరమని వారు తెలియజేశారు. యువ న్యాయవాదులను ఎన్నికలలో పాల్గొనకుండా చేసేందుకే కొందరు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే రాజంపేట, కోడూరు, నందలూరు యువ న్యాయవాదులను కలుపుకొని జిల్లా వ్యాప్త ఉద్యమం చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు హెచ్చరించారు. ఎన్నికల నేపథ్యంలో ఘర్షణ వాతావరణాన్ని సృష్టించిన వారిపై చర్యలు తీసుకుని తమకు రక్షణ కల్పించాలని శుక్రవారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, రాజంపేట డిఎస్పి శివ భాస్కర్ రెడ్డి, బార్ కౌన్సిల్ అధ్యక్షులకు యువ న్యాయవాదులు వినతి పత్రాన్ని సమర్పించారు.

అనురాధ విజయం వైసీపీకి చెంపపెట్టు

విశాలాంధ్ర-మదనపల్లి: తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఎన్టీఆర్ సర్కిల్లో పట్టణ అధ్యక్షులు భవానీ ప్రసాద్ నేతృత్వంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి మిఠాయిలు పంచిపెట్టి ఆనంద ఉత్సవాలు జరుపుకున్నారు ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేష్ మాట్లాడుతూ ఇక మీదట జరగబోయే ప్రతి ఎన్నికలలోనూ తెలుగుదేశం పార్టీ విజయ దంకా మోగిస్తుందని గతంలో జగన్మోహన్ రెడ్డి 23 మంది శాసనసభ్యులు ఎన్నికైనరని తెలుగుదేశం పార్టీ ఎగతాళి చేశారని 151 మంది శాసనసభ్యులు ఉండి కూడా నలుగురు తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులను ప్రలోభాలకు గురిచేసి తన పార్టీలో చేర్చుకున్నాడని న్యాయబద్ధంగా తెలుగుదేశం పార్టీకి రావలసిన ఎమ్మెల్సీని రానీకుండా పోటీ పెట్టాడని చివరికి భగవంతుడు స్క్రిప్ట్ 2023 వ సంవత్సరము మార్చి నెల 23వ తేదీ 23 మంది శాసనసభ్యులు పంచుమర్తి అనురాధ గారికి ఓటు వేశారని అందులో నలుగురు వైసీపీకి చెందిన శాసనసభ్యులు తెలుగుదేశం పార్టీకి ఓటు వేశారని జగన్ మోహన్ రెడ్డి మీద విశ్వాసం కోల్పోతున్నారని చెప్పడానికి ఇదే నిదర్శనం అని తెలిపారు జగన్మోహన్ రెడ్డి నిజంగా పులివెందుల పులిబిడ్డ అయితే వెంటనే తన పదవికి రాజీనామా చేసి అసెంబ్లీ రద్దుపరిచి ఎన్నికలకు వెళ్లాలని ప్రజాతీర్పును తీసుకోవాలని సూచించారు సొంత పార్టీ ఎమ్మెల్యేలే అసంతృప్తితో ఉన్నారనానికి ఇదే నిదర్శనమని ప్రజలలో ఇప్పటికే అన్ని వర్గాలు దూరమయ్యారని ఉద్యోగులు కూడా సకాలంలో జీతాలు ఇవ్వలేదని అసంతృప్తిగా ఉన్నారని టీచర్లు తమ వద్ద చేయడానికి%ఎఱ% పనులు చేయిస్తున్నారని %జు%బాత్రూంలో ఫోటోలు తీస్తున్నారని వాపో వాపోతున్నారని తెలిపారు ఈ ప్రభుత్వం అన్ని రంగాలలో వైఫల్ అని చెందిన దృష్ట్యా వచ్చే ఎన్నికలలో చంద్రబాబు నాయుడు గారిని ముఖ్యమంత్రి చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు ఈ కార్యక్రమంలో నీలకంఠ ఆంజనేయులు దాదుఖాన్ నిషార్ అహ్మద్ మేకల రెడ్డి శేఖర్ ప్రభాకర్ విజయమ్మ రాధ పులిమహాలక్ష్మి నవీన్ చౌదరి సోమశేఖర్ మురళి శ్రీనివాసులు చంద్రశేఖర్ నాయుడు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపి, ఎమ్మెల్యే ఆద్వర్యంలో పంచాయతీ అభివృద్ధి

విశాలాంధ్ర- రైల్వేకోడూరు: రాజంపేట పార్లమెంట్ సభ్యులు లోక్ సభ ఫ్లోర్ లీడర్ పెద్దిరెడ్డి వెంకటమిథున్ రెడ్డి, శాసనసభ్యులు ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో రైల్వేకోడూరు మేజర్ గ్రామపంచాయతీ ప్రగతి పథంలో ముందుకు పోతుందని అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, జిల్లా కో ఆప్షన్ నెంబర్ వైఎస్ అన్వర్ భాష,వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, సర్పంచ్ బుడిగి శివయ్య, ఉపసర్పంచ్ తోట శివసాయి తదితరులు పేర్కొన్నారు. కోడూరు మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద పాత్రికేయులు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ముందుగా రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ ను ప్రణాళిక బద్ధంగా చేపట్టామన్నారు. అబివృద్ధి విషయంలో కోడూరు మేజర్ గ్రామపంచాయతీ కి మహర్దశ వచ్చిందన్నారు. వేసవిలో తాగునీరు కొరత రాకుండా ముందు జాగ్రత్తలు చేపట్టామన్నారు. కడప-రేణిగుంట జాతీయ రహదారి మధ్యలో ఉన్న డివైడర్ మధ్యలో సుందరీకరణ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. శరవేగంగా జరుగుతున్నాయన్నారు. దశలవారిగా వీధులలో సిమెంట్ రోడ్డు పనులు చేపట్టడం జరిగిందన్నారు.విద్యుత్ స్థంబాలు, వీధి దీపాలు ఏర్పాటు చేశామన్నారు.తాగునీటి విద్యుత్ మోటార్లు దెబ్బ తిని కాలిపోయిన వెంటనే మరమ్మతులు చేపట్టి తాగు నీరు అందించామన్నారు. ఒక ఆలశ్యం అయితే ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందిస్తున్నామన్నారు. టౌన్ లో అవసరమైనచోట చెత్త కుండీలు ఏర్పాటు చేశామన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కార్పొరేట్ స్థాయిలో వైద్యశాల పోస్టుమార్టం గది ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తోపుడుబండ్లపైన కూరగాయలు విక్రయించే వారికి రుసుం రద్దు. స్థానికులు కూడ పంచాయితీ అభివృద్ధి కి సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో ఎంపిటిసి లు,వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా మున్సిపల్ చైర్మన్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర -రాజంపేట: పట్టణ ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్న మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులు రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం మున్సిపల్ ఛాంబర్ లో అభిమానులు, కౌన్సిలర్లు మధ్య అట్టహాసంగా వేడుకలు జరుపుకున్నారు. ముందుగా వేద పండితుల చేత ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అంతేకాకుండా పట్టణ కేంద్రంలో పోలా యూత్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో మున్సిపల్ కౌన్సిలర్లు డొంకా సురేష్,రేనాటి రాఘవేంద్ర వర్మ, విష్ణువర్ధన్ నాయక్,న్యామతుల్లా, వైఎస్ఆర్ సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజన తండాలకు స్మశాన వాటిక కల్పించండి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: జిల్లా వ్యాప్తంగా ఉండే గిరిజన తండాలకు, షికారి పాలెం గిరిజనులకు స్మశాన వాటిక స్థలం కేటాయించి గిరిజనులు ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు విశ్వనాథ నాయక్ జాతీయ లంబాడ సంఘం నాయకులు మూడే శంకర్ నాయక్ గిరిజనులతో కలిసి అన్నమయ్య జిల్లా సంయుక్త కలెక్టర్ తమిమ్ అన్సారియ ను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా గిరిజన తండాలలో స్మశాన వాటిక లేక చనిపోయినటువంటి వ్యక్తులకు దహన కార్యక్రమాలు చేసుకోవడానికి పూడుకోవడానికి ఎక్కడో అడవులలో వంకలలో వాగులలో పూడ్చుకుంటే పరిస్థితి 75 సంవత్సరాల స్వతంత్ర భారతావనిలో ఇంకా ఇలాంటి పరిస్థితి ఉందంటే నాటి పాలకులు గిరిజనుల పట్ల ఏమాత్రం ప్రేమ ఉందో అర్థం అవుతుందని తెలిపారు... పైగా సిగ్గులేకుండా నాటి పాలకులు గిరిజనులు అభివృద్ధి చెందారని వాళ్లకు రిజర్వేషన్లు అవసరం లేదని మాట్లాడటం సిగ్గుచేటని.. గిరిజన తండాలకు పర్యటన చేస్తే గిరిజన స్థితిగతులు వారి ఆర్థిక విధివిధానాలు రాజకీయ నాయకులకు తెలుస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు... ఇప్పటికైనా షికారి పాలెం తండా గిరిజనులకు స్మశాన వాటికకు స్థలం కేటాయించి గిరిజనులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు పీనుజీ నాయక్, రాజారాం నాయక్ దేవరాజు నాయక్ సుబ్బయ్య నాయక్ బాయప్ప నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అభివృద్ధికి కృషి చేయాలి:జెసి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: ఆర్బికేల ద్వారా రైతులకు కావాల్సిన సూచనలు, సలహాలను ఎప్పటికప్పుడు అందించి జిల్లాలో వ్యవసాయ అభివృద్ధికి కృషి చేయాలని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజమ్ సుకుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని స్పందన హాల్లో జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని సంబంధిత అధికారులతో కలిసి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజమ్ సుకుమార్ రెడ్డి అధ్యక్షతన జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం జేసి తమీమ్ అన్సారియా మాట్లాడుతూ అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఈ నెల 30 తేదీలోపు గ్రామాల్లోని దెబ్బతిన్న పొలాలను పరిశీలించి, నివేదికలు పంపాలని సూచించారు. ఎక్కడా కూడా పొరపాట్లకు తావు ఇవ్వద్దని, నిజాంగ నష్టపోయిన రైతులు గుర్తించి నివేదిక తయారు చేయాలని తెలిపారు. డిఆర్ డిప ఆధ్వర్యంలో ఏప్రిల్ 4 తేదీ నుంచి జిల్లా స్థాయిలో చిరుధాన్యాల పైన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నరని, అదే విధంగా డివిజన్ స్థాయిలో కూడా నిర్వహించాలని, ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొన్నాలని తెలిపారు. రబీ -2023 సంబంధించి పంట నమోదు వివరాలను సామాజిక తనిఖీ ద్వారా సవరించిన తుది జాబితాను ఈ నెల 30 తేదీ లోపల రైతు భరోసా కేంద్రాల యందు ప్రదర్శించాలని సహాయ వ్యవసాయ సంచాలకులను ఆదేశించారు. గ్రామానికి ఒకటి చొప్పున మంజూరైన కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లను (యంత్ర సేవా కేంద్రాలు) త్వరితగతిన ఈ నెల 30 తేదీ లోపల పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ, సహాయ వ్యవసాయ సంచాలకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయ సలహా మండలి కమిటీ సభ్యులు దిన్నేపాడు రవిరాజు, బోధషావలి, వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సొచ్చరికం భూముల కబ్జాను అరికట్టండి :సీపీఐ

విశాలాంధ్ర-చిట్వేలి : చిట్వేలి మండలంలో తిమ్మాయపాలెం పంచాయతీ నరసింహారెడ్డి ఎస్టీ కాలనీలో సిపిఐ మండల కార్యదర్శి తిప్పన ప్రసాద్ ఆధ్వర్యంలో గిరిజన కాలనీలో పర్యటించారు.కార్యక్రమానికి సిపిఐ రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య హాజరయ్యారు వారు మాట్లాడుతూ తిమ్మాయపాలెం పంచాయతీలో సొచ్చరికం భూమి సుమారు 100 ఎకరాలుగా ఉన్నది సదరు భూమిని కొంతమంది రాజకీయ అండదండలతో 50 ఎకరాలు కబ్జాకు గురైందని ఇంకా 50 ఎకరాలు మిగిలిఉన్న కబ్జా చేసినటువంటి కబ్జాదారులపై చిట్వేలి మండల రెవెన్యూ తాసిల్దారు వెంటనే విచారణ జరిపి కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని వాళ్లపైన కేసులు పెట్టి సదరు భూమిని రెవెన్యూ వారు ఆ భూమిని పూర్తిగా స్వాధీనం చేసుకుని 100 ఎకరాలు అక్కడే ఉన్నటువంటి నరసింహారెడ్డి ఎస్టీ నిరుపేద అయినటువంటి వారు 30 కుటుంబాలు వారు గిరిజన బిడ్డలకు ఉన్నారు వారికి జరగబోయే ఎనిమిదో విడత అసైన్మెంట్ భూ పంపిణీ కార్యక్రమంలో ఒక్కొక్క కుటుంబానికి రెండు ఎకరాల చొప్పున పట్టాల మంజూరు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ గా మేము డిమాండ్ చేస్తున్నాం లేని పక్షాన అక్కడే ఉన్నటువంటి గిరిజన బిడ్డలను కలుపుకొని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో భారీ ఎత్తున తహసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని అప్పటికే నరసింహారెడ్డి ఎస్టి కాలనీ లో ఉన్న గిరిజన బిడ్డలకు న్యాయం జరగకపోతే కలెక్టర్ కార్యాలయం దగ్గర ధర్నా చేపడతామని అధికారులను హెచ్చరిస్తున్నాం. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి నిరుపేద దళిత గిరిజనులకు భూ పంపిణీ కార్యక్రమంలో వేలాది ఎకరాలు ప్రభుత్వ భూములు పంపిన తర్వాత టిడిపి ప్రభుత్వంలో నిరుపేదలకు ఒక సెంటు భూమి పంచిన పాపాన పోలేదని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ చిట్వేలి మండల సహాయ కార్యదర్శి సామా గంగయ్య, తిమ్మాయిపాలెం ఎస్టి కాలనీవాసులు పాల్గొన్నారు.

డోంట్ స్టాప్ ఎంజాయ్..పూనకాలు లోడింగ్.!

తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో ఫుల్ జోష్ - వరుస విజయాలతో కార్యకర్తల్లో నూతనోత్సాహం

మొక్కులు తీర్చుకుంటున్న కార్యకర్తలు

విశాలాంధ్ర -రాజంపేట: డోంట్ స్టాప్ ఎంజాయ్.. పూనకాల లోడింగ్.. ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీ టిడిపిలో ఉన్నటువంటి కార్యకర్తల్లో ఉప్పెంగుతున్న ఉత్సాహం, ఉల్లాసం అని చెప్పడంలో సందేహం లేదు. సుదీర్ఘ విరామం తర్వాత వరుస విజయాలతో పార్టీ దూసుకుపోవడంతో కార్యకర్తల్లో, నేతల్లో ఆనందాలకు హద్దులు లేవు.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆనందోత్సవాలల్లో మునిగి తేలుతున్నారు. రాష్ట్రంలో వైఎస్ఆర్సిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వరుస అపజయాలను చెవిచూసిన తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఎమ్మెల్సీ ఎన్నికల పుణ్యమా అంటూ వరుస విజయాలతో విజయోత్సవ సంబరాలలో దూసుకుపోతున్నారు. ఇటీవల జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో నిలిచిన ముగ్గురు అభ్యర్థులు విజయం సాధించి అధికార పార్టీకి ఊహించని షాక్ ఇచ్చారు. పట్టపద్రుల షాక్ నుండి అధికార పార్టీ కోలుకోకముందే గురువారం జరిగిన ఎమ్మెల్యేల కోట మండలి విజయంతో సంబరాలు జోరుగా చేసుకుంటున్నారు. ఒక్క అవకాశం ఇవ్వండి అంటూ అధికారంలోకి వచ్చిన వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పట్ల ప్రజలు విశ్వాసాన్ని కోల్పోవడం జరుగుతోందంటూ సంబరాలు చేసుకుంటున్నారు. ప్రధానంగా తెలుగుదేశం పార్టీ పూర్వ వైభోగానికి తీసుకురావడానికి శాసనసభ్యులు కోటాకు చెందిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థి పంచుమర్తి అనురాధ అనూహ్యంగా విజయం సాధించడమే. 2019 ఎన్నికల్లో అనూహ్య పరాజయం అనంతరం ఆ పార్టీ రోజురోజుకు కార్యకర్తల్లో విశ్వాసాన్ని కోల్పోయేది.ఓ దశలో కొన్ని నియోజకవర్గాలలో నాయకులు కూడా మౌనం పాటించారు.రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ స్థానిక ఎన్నికలను బహిష్కరించింది.అయితే కొందరు పార్టీ అభిమానులు, ఆసక్తి పరులు మాత్రం స్వతంత్ర అభ్యర్థులుగానే బరిలో దిగారు.పలుచోట్ల తమ సత్తా చాటారు. కొందరు విజయం సాధించారు. అయినా పార్టీ నుంచి పెద్దగా గుర్తింపు రాలేదు. దీంతో గత రెండేళ్లుగా జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఉత్సాహాన్ని కోల్పోయారు.ఇప్పట్లో తిరిగి అధికారంలోకి రాగలమన్న విశ్వాసం వారిలో కొరబడింది.ఒకవైపు దూకుడుగా అధికార పార్టీ వైసిపి వ్యవహరించడం కూడా స్తబ్దతకు దారితీసింది. ఈ దశలో పట్టపదుల స్థానాలకు జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడం ఉమ్మడి జిల్లా తెలుగుదేశం లో కూడా చాలావరకు చైతన్యానికి తావిచ్చింది. కాగా ఎమ్మెల్యే కోటాలో విజయం వారిలో ఒక్కసారిగా ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది.వరుస విజయాలతో తెలుగుదేశం పార్టీ పట్ల ప్రజల్లో చర్చ మొదలైంది.కార్యకర్తలు, నేతలు వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం తధ్యమని ప్రకటనలు చేస్తున్నారు.

మొక్కులు తీర్చుకుంటున్న దేశం శ్రేణులు:

ఎమ్మెల్యేల శాసనమండలి కోటా ఎన్నికల్లో టిడిపి తరఫున బరిలో నిలిచిన పంచమర్తి అనురాధ అనూహ్యంగా విజయం సాధించడంతో రాజంపేటలో నియోజకవర్గ ఇన్చార్జ్ బత్యాల చెంగల్ రాయుడు ఆధ్వర్యంలో టిడిపి ఫ్లోర్ లీడర్ తుపాకుల అశోక్ కుమార్ శివాలయంలో 101 టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ గ్రూప్ మెయిన్స్ పరీక్షలకు గడువు పెంచాలి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల కోసం ఇచ్చిన 85 రోజుల సమయం సరిపోదని, మరో 3 నెలల అదనంగా సమయం ఇవ్వాలని విద్యార్థి సంఘాల నాయకులు టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ఏఐఎస్బి రాష్ట్ర కన్వీనర్ జయవర్ధన్, పి ఎస్ యు రాష్ట్ర కార్యదర్శి సుబ్బారాయుడు, ఆర్ఎస్ వై ఫ్ రాష్ట్ర కార్యదర్శి శంకర్ టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంటు ఉపాధ్యక్షులు కటారి శివ లు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు స్థానిక టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ మెయిన్స్ పరీక్షలకు గడువు పెంచకపోతే రాష్ట్రంలోని విద్యార్థి సంఘాలను కలుపుకొని ఏపీపీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని పేర్కొన్నారు. గ్రూప్-1 ప్రిలిమనరీ పరీక్ష క్వాలిఫై అయిన అభ్యర్థులు ప్రిపరేషన్ కోసం కేవలం 85 రోజులే ఇచ్చారని, ఏడు పేపర్లు ప్రిపేర్ కావడానికి ఈ సమయం చాలదని పేర్కొన్నారు. మెయిన్స్ పరీక్షకు అన్ని అంశాలలో అవసరమైన లోతైన జ్ఞానం, లోతైన విశ్లేషణ చేసేందుకు ఇచ్చిన సమయం సరిపోధన్నారు. మెయిన్స్ పరీక్షకు మరో మూడు నెలల అదనపు సమయం పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు. కొత్తవారితోపాటు, ఉద్యోగాలు చేసుకుని గ్రూప్-1 రాసేవారికి ఈ అదనపు సమయం ప్రిపేర్ కావడానికి ఎంతో ఉపయోగపడుతుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

పోషణ్ పక్వాడ పై అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర-రాజంపేట: పట్టణ కేంద్రంలోని శుక్రవారం బోయపాలెం లోని అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్త శివరంజని ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భవతులు, బాలింతలకు చిరుధాన్యాలు, పోషకాహారం తీసుకోవడం పట్ల అవగాహన కల్పించడమే పోషణ్ పక్వాడ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని మూడవ వార్డు ఎం.ఎస్.కె విజయ కుమారి, అంగన్వాడీ కార్యకర్త శివరంజని తెలియజేశారు. చిరుధాన్యాలను ఏ మోతాదులో, ఏ సమయంలో, ఎలా తీసుకోవాలో వివరించారు. గర్భవతులు, బాలింతలు పోషకాహారం, చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈడిగ పాలెం అంగన్వాడి కార్యకర్త అమరావతి, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థికసాయం

విశాలాంధ్ర-సిద్దవటం : రాజంపేట నియోజవర్గం సిద్ధవటం మండలం జంగాల పల్లి చెందిన గ్రామ ప్రజలు ఇటీవల ఉపాధి పని కోసం ఆటోలో వెళుతున్న సందర్భంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీ ఆటోను ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న 14 మంది ప్రయాణికులకు గాయాలు కావడం, అందులో ఇద్దరు ప్రయాణికులకు యాక్సిడెంట్ లో పూర్తిగా కాళ్ళు తీసేయడం జరిగింది. ఈ సంఘటన తెలుసుకున్న రాజంపేట జనసేన పార్టీ యువ నాయకుడు అతికారి దినేష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జంగాలపల్లి గ్రామ ప్రజలను పరామర్శించి వారికి జనసేన పార్టీ తరపు నుండి దినేష్ 45000 రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ అక్రమ ఇసుక రవాణా చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని అంతే కాకుండా ప్రమాదంలో గాయపడ్డ జంగాలపల్లి ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని లేని పక్షంలో బాధితుల అండగా పోరాటం చేసేందుకు జనసేన పార్టీ సిద్ధంగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ఇన్చార్జి కొట్టే రాజేష్, జనసేన నాయకులు పంద్ర రంజిత్ కోనేటి హరి వెంకట రమణ, మోడెం నాగరాజా తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న బొలెరో..

ఒకరు దుర్మరణం మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

మృతుడు సత్యసాయి జిల్లా వాసిగా గుర్తింపు..

విశాలాంధ్ర-మదనపల్లి: మదనపల్లి పుంగనూరు రోడ్డు బసినికొండలో శుక్రవారం ఉదయం ఆటోను బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడి మదనపల్లి జిల్లా ఆస్పత్రిలో చేరారు. రూరల్ పోలీసుల కథనం మేరకు.. మదనపల్లి మండలం పుంగునూరు రోడ్డు బసినికొండ గంగమ్మ గుడి సమీపంలో పుంగనూరు వైపు నుంచి మదనపల్లి కు వస్తున్న బొలెరో వాహనం ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో సత్యసాయి జిల్లా తనకల్లుకు చెందిన వంట మాస్టర్ వెంకటేష్(30) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో ఆటోలో చంద్రకాలనికి చెందిన ఆటో డ్రైవర్ సురేష్ 28, రంగారెడ్డి కాలనీకి చెందిన చంద్రకళ 40 పుంగనూరులో ఓ కార్యక్రమానికి భోజనాలు వండుకుని వెళుతుండగా ఈ ప్రమాదం జరిగి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. గటనపై రూరల్ ఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన వ్యక్తి శవమై తేలాడు

విశాలాంధ్ర-రామాపురం : కర్నూలు - చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం గువ్వల చెరువు ఘాట్. రోడ్డు లోని కోనేటి బండల వద్ద శుక్రవారం చిన్న అచ్చన్న పశు సాంప్రదాయక శాఖ డిప్యూటీ డైరెక్టర్ (58) అనే వ్యక్తి శవమై కనిపించి నట్లు ఎస్సై కొండారెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కడప పట్టణంలోని కోటిరెడ్డి సర్కిల్లో పశు సంవర్త శాఖ డిప్యూటీ డైరెక్టర్ గా విధులు నిర్వహిస్తూవున్న కంటే చిన్న అచ్చన్న ఈనెల 14న కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు తన కుమారుడు క్వింటన్ చక్రవర్తి ఒన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారనీ శుక్రవారం గువ్వల చెరువు ఘాట్ రోడ్లో శవమైయిందని ఎస్ఐ తెలిపారు. మృతుని వద్ద ఉన్న ఆధార్ కార్డు డిపార్ట్మెంట్ కార్డు హెల్త్ కార్డు తన కుడి చేతికి ఉన్న బంగారు ఉంగరం పై వీణా ముద్ర కల్గిన సమాచారం ఫోన్ నెంబర్ ఉండడంతో సమాచారం కొరకు ఫోన్ నెంబర్ ఫోన్ చేయగా తన కుమారునికి ఫోన్ వెళ్ళిందని తన తండ్రి సమాచారాన్ని అంతయు ఎస్ఐ కొండారెడ్డి కి వివరించారన్నారు. తన కుమారుడు ఈనెల 14వ తేదీన కడప వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో తన తండ్రి కనిపించలేదని ఫిర్యాదు చేసినట్టు బాధ్యుడు తెలిపిన చెప్పారు. కడప వన్ టౌన్ పోలీసులు మిస్సింగ్ కేసు విషయంపై విచారణ చేస్తున్నారని శుక్రవారం గువ్వల చెరువు ఘాట్ రోడ్డు బండలు సమీపంలో చిన్న అచ్చన్న శవమై లభ్యం కావడంతో ఈ మృతికి సంబంధించిన సమాచారం కోసం మృతుడు అనుమానస్పదముతో మృతి చెందాడ .తనంతకు తానే ఆత్మహత్య చేసుకుని ఉంటారా. లేక ప్రమాదవశాత్తు తో మృతి చెందాడు. లేదా ఇతర కారణాల వలన ఏమైనా జరిగిందా అని అన్ని కోణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సంఘటన స్థలానికి లక్కిరెడ్డిపల్లి సిఐ వరప్రసాద్. ఏఎస్ఐ శర్మ పోలీస్ సిబ్బందితో చేరుకొని సంఘటన స్థలంలోనే శివపరీక్ష నిర్వహించారు. శివ పరీక్ష అనంతరం తమ బంధువులకు అప్పగించడం కోసం పోలీసులు ఎదురు చూస్తున్నారు అన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొండారెడ్డి తెలిపారు.